

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 19-12-2025 | సంపుటి - 26 | సంచిక -211 | రూ : 4 | పేజీలు: 8


## కేసీఆర్ క్రియాశీలక రాజకీయాల్లో లేరు..

ఆయనతో ప్రయోజనం లేదని గజ్వేల్ ప్రజలకు అర్థమైంది : రేవంత్ రెడ్డి

- పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు వచ్చాయన్న ముఖ్యమంత్రి
- కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఒక్క ఎన్నికను కూడా గెలవలేదని విమర్శ
- 2029 ఎన్నికల్లోనూ ఇవే పునరావృతమవుతాయని వ్యాఖ్య

2లో





2లో

## 2 గంటలకు బాంబు పేలుతుంది

- నాంపల్లి సీబీఐ కోర్టుకు బాంబు బెదిరింపు
- జడ్జిలు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులను బయటకు పంపించి తనిఖీలు చేపట్టిన పోలీసులు
- బెదిరింపుకు పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు సైబర్ పోలీసుల యత్నం




2లో

## విచారణలో నోరు విప్పిన ఐబొమ్మ రవి..

- శాటిలైట్ లింక్, క్యూబ్ నెట్‌వర్క్ హ్యాక్ చేసినట్లు వెల్లడి
- హెచ్‌డీ హబ్ టెలిగ్రామ్ ఛానల్ ద్వారా పైరసీ లింకుల అమ్మకం
- ఒక్కో లింక్‌కు 300 డాలర్ల వరకు వసూలు

## ప్రధాని మోదీకి ఒమన్ అత్యున్నత పురస్కారం

2లో

- 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను ప్రదానం చేసిన సుల్తాన్
- రెండు రోజుల క్రితం ఇథియోపియా నుంచి కూడా అత్యున్నత గౌరవం
- భారత్-ఒమన్ మధ్య కీలక సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం
- ఇరు దేశాల 70 ఏళ్ల దౌత్య సంబంధాలకు గుర్తుగా ఈ పర్యటన





2లో

## పేదరికం మాయమవుతుంది.. అందరికీ అధిక ఆదాయం వస్తుంది : ఎలాన్ మస్క్

* భవిష్యత్తులో డబ్బు ఆదా చేసుకోవాల్సిన అవసరం ఉండదన్న మస్క్
* ఏఐ రాకతో అందరికీ అధిక ఆదాయం లభిస్తుందని వ్యాఖ్య
* 'ట్రంప్ అకౌంట్స్' పథకంపై స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు

## ఏపీలో జనాభా సంక్షోభం... రెండో బిడ్డను కంటే ప్రోత్సాహకాలు ఇచ్చే యోచన!

ఏపీలో వేగంగా పెరుగుతున్న వృద్ధుల జనాభా.. పడిపోయిన సంతానోత్పత్తి రేటు



- సంతాన సాఫల్యత పెంచేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫెర్టిలిటీ కాలేజీల ఏర్పాటు
- జనాభా నియంత్రణ నుంచి జనాభా సుస్థిరత వైపు ప్రభుత్వ పాలసీ మార్పు
- మహిళల ఉపాధి భాగస్వామ్యం పెంచి జీఎస్‌డీపీ వృద్ధికి ప్రణాళికలు

2లో

## రష్యా సైన్యంలో 202 మంది భారతీయులు

- ఇప్పటివరకు 119 మందిని సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చినట్టు వెల్లడి
- మరో 50 మంది విడుదల కోసం రష్యాతో చర్చలు జరుపుతున్నట్టు ప్రకటన
- మరణించిన వారిలో 10 మంది మృతదేహాలను స్వదేశానికి తరలింపు
- మృతుల గుర్తింపు కోసం 18 కుటుంబాల డీఎన్ఏ శాంపిళ్లు రష్యాకు పంపినట్టు వెల్లడి



2లో

# పేదరికం మాయమవుతుంది.. అందరికీ అధిక ఆదాయం వస్తుంది

డిసెంబర్ 18: ప్రపంచ కుబేరుడు, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో ప్రజలు డబ్బు ఆదా చేసుకోవాల్సిన అవసరమే ఉండదని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాకతో 'యూనివర్సల్ హై ఇన్‌కమ్' (అందరికీ అధిక ఆదాయం) అందుబాటులోకి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. అమెరికాలో ప్రవేశపెట్టిన 'ట్రంప్ అకౌంట్స్' పథకంపై బిలియనీర్ ఇన్వెస్టర్ రే డాలియో చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ మస్క్ ఈ విధంగా పేర్కొన్నారు. ఏఐ, రోబోటిక్స్ రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పుల వల్ల పేదరికం పూర్తిగా తొలగిపోతుందని, సంప్రదాయ ఉద్యోగాల అవసరం కూడా తగ్గుతుందని మస్క్ చాలాకాలంగా చెబుతున్నారు. ఇదే విషయాన్ని పునరుద్ఘాటిస్తూ, "భవిష్యత్తులో పేదరికం అనేదే ఉండదు. కాబట్టి డబ్బు ఆదా చేయాల్సిన అవసరం రాదు. అందరికీ అధిక ఆదాయం ఉంటుంది" అని ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. ఉత్పాదకత విపరీతంగా పెరిగితే, గాలి మాదిరిగానే డబ్బే అసంబద్ధంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, మస్క్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 600 బిలియన్ డాలర్ల సంపద కలిగిన వ్యక్తి, ఇతరులకు డబ్బు దాచుకోవద్దని సలహా ఇవ్వడం విడ్డూరంగా ఉందని పలువురు నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు. "అన్నీ ఉచితంగా లభిస్తే, వస్తువులను ఉత్పత్తి చేయడానికి ఎవరికి ప్రోత్సాహం ఉంటుంది?" అని ఒకరు ప్రశ్నించగా, "అందరికీ ఆదాయం వచ్చినా, 'అధిక ఆదాయం' అనే నిర్వచనం ఎప్పటికప్పుడు మారుతూనే ఉంటుంది" అని మరొకరు అభిప్రాయపడ్డారు. ఇటీవలే ఎలాన్ మస్క్ సంపద 600 బిలియన్ డాలర్ల మైలురాయిని దాటినట్లు ఫోర్బ్స్ ప్రకటించింది. ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తి ఆయనే కావడం గమనార్హం. తన స్పేస్‌ఎక్స్ స్టార్టప్ విలువ 800 బిలియన్ డాలర్లకు చేరవచ్చన్న నివేదికల నేపథ్యంలో ఆయన సంపద గణనీయంగా పెరిగింది.

**ఏమిటీ 'ట్రంప్ అకౌంట్స్'?**

'ట్రంప్ అకౌంట్స్' అనేది అమెరికాలో కొత్తగా ప్రవేశపెట్టిన ఒక ఫెడరల్ పథకం. దీని కింద, కొత్తగా పుట్టిన పిల్లల పేరుపై తల్లిదండ్రులు ఖాతా తెరిస్తే, ప్రభుత్వం ఒకేసారి $1,000 జమ చేస్తుంది. ఈ మొత్తాన్ని స్టాక్ మార్కెట్లో పెట్టుబడిగా పెట్టి, పిల్లలకు 18 ఏళ్లు వచ్చేసరికి ఆర్థికంగా భరోసా కల్పించడం దీని లక్ష్యం.

# మనిషి తలరాత మార్చేది విద్యే

అవును ఖచ్చితంగా మన తల రాతను మనం చదువుకున్న చదువులే మార్చుతుంటాయి. దానికి ప్రత్యక్ష ఉదాహరణ నేనే. అందుకే, విద్యకు విద్యే సాటి. దీనికి సాటి ఈ ప్రపంచంలోనే మరొటి లేదు. విద్యా రంగం పటిష్టంగా ఉంటేనే అభివృద్ధి గమనించబడుతూ భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుంది.



**డాక్టర్ ఎం. ప్రభు దయాల్**
**కొత్తగూడెం**
**పూర్వ ప్రిన్సిపాల్, గిరిజన విద్యాకళాశాల**
**భద్రాచలం**
**మాజీ సినేట్ మెంబర్, కాకతీయ యూనివర్సిటి**
**వరంగల్**
**జీవిత సభ్యుడు ఐఏటిఈ**

**"చదువుకున్న వ్యక్తి - చదువులేని వ్యక్తి"**

'చదువు గల సమాజం చదువు లేని సమాజం' ఈ రెండింటిని గూర్చి తగు విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తే వాస్తవాలు వెల్లడవుతున్నాయి. ఒకసారి పరిశీలించండి.

ఉదా! నేను అంతో ఇంతో చదివి, విలువలను ఆపాదించుకోవడం వల్లనే ఈ విధంగా వ్యాసాలు రాస్తూ..... మీలో కొంత అవగాహన పెంపొందించేలా తపిస్తున్నాను. మనం చదువుకున్న విద్య తలరాతను మార్చుతుంది. ఇది నగ్నసత్యం. అందుకే అన్నింటిలో విద్యకు మొదటి ప్రాధాన్యత అవసరం. ఇందులో రెండో ఆలోచనకు తావే లేదు. విద్య సత్యానికి, జ్ఞానానికి ప్రతిరూపంగా అందించబడాలి. పూర్వం నుంచే మన ప్రాచీనులు సత్యం గూర్చి, జ్ఞానం గూర్చి పరితపిస్తూ అన్వేషించే వారని స్పష్టమవుతోంది. అదే వారు చేసిన గొప్ప పుణ్య కార్యం. ఆనాడే మన పూర్వీకులు "తమసోమా జ్యోతిర్గమయా" అంటూ ప్రార్థించేవారు. అంటే ఆనాడే వారు తమ జీవితాల పట్ల సమగ్రమైన పద్ధతులను అవలంబించే వారని స్పష్టమవుతోంది. ఇదే పోకడ కొనసాగించబడితే విద్యారంగం ఇంకా బ్రహ్మాండంగా ఉండేది. విద్యారంగంలో ప్రగతి సాధించినా ఇంకా సాధించాల్సి ఎంతో ఉంది.

ఏ సమాజం (దేశం) ప్రగతి అయినా ఆ సమాజం (దేశం) అందించే విద్యపైనే ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. అందుచేతనే విద్యారంగం సామాజిక వ్యవస్థలో అతి ముఖ్యమైన వ్యవస్థగా పేర్కొనబడింది. సమాజంలో అమలులో ఉండే, అమలు చేయబడే విద్యా విధానమే ఖచ్చితంగా సమాజ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మన విద్యా చరిత్రను ఒకసారి పరిశీలిస్తే..... ఆశ్చర్యంగా నాగరికత గూర్చి ప్రపంచానికి ప్రథమ పాఠాలు నేర్పింది మన దేశమే. విజ్ఞాన శాస్త్రాలు కూడా ఏనాడో పరిచయం చేయబడ్డాయి. క్రీ||పూ 3వ శతాబ్దంలోనే అశోక చక్రవర్తి తన రాజ్యమంతా గొప్ప శాసనాలు వేయించారు. సదరు శాసనాల్లో ధర్మానికి సంబంధించినవే అతి ముఖ్యమైనవిగా ఉండటం గొప్ప విషయం. ఆర్యభట్టు, బ్రహ్మగుప్త, భాస్కరుడు, పతాంజలి మొదలగు మహానుభావులున్న చరిత్ర మనది. అలనాడే బౌద్ధుల కాలంలో పేరొందిన తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాలు ప్రపంచ దృష్టిని ఆకర్షించడంతో, పాహియాన్, హుయాన్ త్సాంగ్ వంటి విదేశీ పండితులు మన దేశాన్ని దర్శించినట్లు చరిత్ర చెబుతోంది. దీనికి ప్రధాన ఏకైక కారణం విద్యారంగంపై తగు దృష్టి సారించడమే!

అలనాడు విద్యారంగంలో ముఖ్య ధృవాలైన ఉపాధ్యాయుడు మరియు విద్యార్థి తమ తమ విద్యుక్త ధర్మాలను చిత్తశుద్ధితో, ఖచ్చితంగా, నీతి నిజాయితీలతో నిర్వహించేవారు. అంటే విద్యార్థుల్లో జ్ఞాన తృష్ణ, ఇంకా నేర్చుకోవాలనే జిజ్ఞాస ఉండేది. అదే రీతుల్లో ఉపాధ్యాయులంతా (గురువు) తమ తమ విద్యుక్త ధర్మాలను ఖచ్చితంగా నిర్వహిస్తూ, విద్యార్థుల జ్ఞాన తృష్ణను తీర్చేవారు. సత్యమార్గంలో నిస్వార్థంతో తమకున్న సర్వజ్ఞానాన్ని బదలాయించేవారు. ఈ మేరకు ప్రతి విషయంలోనూ విద్యార్థులు గురువులను ఆదర్శంగా తీసుకునేవారు. గురువే దైవంగా, గురువే సర్వస్వంగా, గురువు గారిని గౌరవిస్తూ, గురువు ఆజ్ఞలను ఖచ్చితంగా పాటించేవారు. దీంతో గురు శిష్య సంబంధాలు పవిత్రంగా వర్ధిల్లుతుండేవి. విద్యాభ్యాసంలో... "ఎల్లప్పుడూ సత్యాన్నే పలుకుతూ, ధర్మాన్ని ఆచరిస్తూ, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించు" అనేదే ప్రధాన లక్ష్యంగా ఉండేది. ఈ ఆచరణతో సమాజంలో మాదిరికర జీవితాలు, ఆరోగ్యవంతమైన సమాజం గమనించబడేది. ఎల్లప్పుడూ సత్యాన్ని పలుకుతూ, ధర్మాన్ని నెరవేరుస్తూ, ఎవరి బాధ్యతలను వారు నిర్వహిస్తే ఇక సమస్యలు ఎందుకుంటాయి? చెప్పండి. సమాజంలో ఎవరికి నిర్దేశించిన పనులను, బాధ్యతలను ఎవరికి వారు సమర్థవంతంగా నిర్వహిస్తే ఇక సమస్యలకు, ఇబ్బందులకు చాన్సే లేదు. అభివృద్ధి గమనించబడి తీరుతుంది. ఎవరి బాధ్యతలను వారు సక్రమంగా నిర్వర్తించకపోవడమే నేడు సకల సమస్యలకు హేతువుగా ఉంటోంది.

అలనాడు విద్యార్థులు తమ విద్యార్జన కాలంలో తప్పనిసరి నియమాలను తూచా పాటించేవారు. తమ చర్యల ద్వారా గురువును మెప్పిస్తూ తమకు విద్యపై ఆసక్తి ఉన్నదనే విషయాన్ని రుజువు చేసుకునేవారు. వారి క్రియలను గమనించి, గురువు సంతృప్తినొంది విద్యను అందించేవారు. సత్ప్రవర్తన, శీల నిర్మాణం, నైతిక విలువలు ప్రధాన అంశాలుగా భోధించబడేవి. గురు శిష్యుల మధ్య అతి పవిత్రమైన అన్యోన్య సంబంధాలు ఉండేవి. విద్యార్థి తన గురువును అత్యంత భక్తిశ్రద్ధలతో గౌరవించేవారు. గురువు ఆజ్ఞనే వేదవాక్కుగ పాటించేవారు. గురువే సర్వసంగా, కడు భక్తి శ్రద్ధలతో విద్యాభ్యాసాన్ని కొనసాగించేవారు. అదే రీతుల్లో గురువుగారు కూడా తమ స్వంత పిల్లల వలె తమ శిష్యుల పట్ల అమితమైన ప్రేమానురాగాలను ప్రదర్శించేవారు. ఒక్క వాక్యంలో చెప్పాలంటే గురువు తమ శిష్యులను పరిపూర్ణ వ్యక్తులుగా తయారుచేయడానికి ఏదీ దాచకుండా, ఆశించకుండా, నిస్వార్థంతో తమకున్న జ్ఞానాన్ని పంచేవారు. తగు మార్గదర్శకం చేసేవారు. ఈ విధంగా గురు శిష్యుల సంబంధం చిరకాలం, నిరంతరం కొనసాగేది. ఆనాడు, గురువు పట్ల వినయం, విధేయత కలిగి ఉంటూ గురువునే దైవంగా భావిస్తూ అత్యంత భక్తిశ్రద్ధలతో విద్యనభ్యసించేవారు అలాగే, గురువు కూడా తన వృత్తికి పూర్తి న్యాయం చేస్తూ వృత్తి ధర్మాన్ని ఖచ్చితంగా నిర్వర్తించేవారు. ఆత్మ నిగ్రహం అనేది ప్రధానమైనదిగా ఉండేది.

*** ఇక, మరి ప్రస్తుత పరిస్థితులు? ఒకసారి పరిశీలించండి. నిశితంగా ఆలోచించండి!**

ఈ మేరకు పునాది స్థాయి చదువులే పటిష్టంగా, పద్ధతిగా, కరెక్టుగా అందించబడాలంటూ స్పష్టం చేయబడుతోంది. ఎన్ని పథకాలు, ఎన్ని కమీషన్లు, ఎన్ని స్కీంలు వచ్చినా..... విద్యారంగం పర్ఫెక్ట్ గ నిర్వహించబడాలి. విద్యారంగానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడాలి. అప్పుడే బ్రహ్మాండమైన భవిష్యత్తు గోచరిస్తుంది. విద్యారంగానికి, మరియు ముఖ్యంగా ప్రాథమిక విద్యకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలి. ఎందుకంటే ప్రాథమిక విద్య వ్యక్తిలోని శక్తిసామర్థ్యాలను బహిర్గతం చేస్తూ అతని సాధనా శక్తిని మెరుగుపరుస్తూ స్వేచ్ఛగా జీవించే మార్గాన్ని సుగమం చేస్తుంది. విద్యా పునాదులే పటిష్టంగా ఉంటే ఇక దానిపై ఎన్ని అంతస్తులైనా దృఢంగా ఆపై నిర్మించవచ్చు. ప్రాథమిక విద్యపై పూర్తి దృష్టి సారిస్తే, సంపూర్ణ అక్షరాస్యత, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, పేదరిక నిర్మూలన, చైతన్యం వంటివి గమనించబడుతూ, సమాజంలో అర్హత గల మనుష్యులు గమనించబడుతుంటారు. దీంతో స్థిరత్వం గమనించబడుతుంది. ఎప్పుడైతే స్థిరత్వం గమనించబడుతుందో ఇక ఆలోచన విధానాలు మెరుగుపడుతూ, అర్థవంతమైన జీవితాలను కలిగి ఉంటారు. వాస్తవాలకు దగ్గరగా జీవిస్తూ వివేచనతో బ్రతుకుతూ, సహనం, సామరస్యం, సర్దుబాటు, తథాభూతులను కలిగి ఉంటూ ఆదర్శప్రాయులుగా గమనించబడతారు. ఇదే విద్యకు ఉన్న గొప్పతనం అందుకే, విద్యకు విద్యే సాటి. దానికి సాటి ఇలలో మరోటి లేదు. విద్యను స్వంతం చేసుకుంటూ అఖండమైన భవిష్యత్తులను సాధించాలి. విద్యే తలరాతను మార్చివేస్తుంది. అగ్ర భాగంలో ఉంచుతుందని అందరూ గమనించాలి.

# రష్యా సైన్యంలో 202 మంది భారతీయులు..

రష్యా, డిసెంబర్ 18 : రష్యా సైన్యంలో 2022 నుంచి ఇప్పటివరకు 202 మంది భారతీయులు చేరారని, వారిలో 26 మంది మరణించగా, మరో ఏడుగురు గల్లంతయ్యారని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇవాళ రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే, కాంగ్రెస్ ఎంపీ రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా అడిగిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈ వివరాలు తెలిపారు. భారత్ చేపట్టిన దౌత్యపరమైన చర్యల ఫలితంగా ఇప్పటివరకు 119 మందిని రష్యా సైన్యం నుంచి విడిపించి వెనక్కి తీసుకొచ్చినట్లు మంత్రి వివరించారు. మరో 50 మంది భారతీయులు ఇంకా విడుదల కోసం ఎదురుచూస్తున్నారని, వారి భద్రత, సంక్షేమం, వీలైనంత త్వరగా స్వదేశానికి రప్పించేందుకు రష్యా అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన తెలిపారు. యుద్ధంలో మరణించిన 26 మందిలో 10 మంది మృతదేహాలను భారత్‌కు తరలించినట్లు ప్రభుత్వం ధృవీకరించింది. మరో ఇద్దరి అంత్యక్రియలు భారత రాయబార కార్యాలయం సహాయంతో రష్యాలోనే స్థానికంగా పూర్తి చేసినట్లు పేర్కొంది. మరణించిన లేదా గల్లంతైన వారిలో కొందరిని గుర్తించేందుకు, 18 మంది భారతీయుల కుటుంబ సభ్యుల డీఎన్ఏ నమూనాలను రష్యా అధికారులతో పంచుకున్నట్లు మంత్రి తెలిపారు. రష్యాలోని భారత రాయబార కార్యాలయం, సైన్యం నుంచి విడుదలైన వారికి ప్రయాణ పత్రాలు, విమాన టిక్కెట్లు, ఇతర లాజిస్టికల్ మద్దతు అందిస్తోందని ప్రభుత్వం తెలిపింది. ఈ అంశాన్ని ఇరు దేశాల నేతలు, మంత్రులు, ఉన్నతాధికారుల మధ్య జరిగిన పలు సమావేశాల్లో ప్రస్తావించినట్లు చెప్పింది. మిగిలిన భారతీయులందరినీ సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే వరకు తమ ప్రయత్నాలు కొనసాగుతాయని పార్లమెంటుకు హామీ ఇచ్చింది.

# ప్రధాని మోదీకి ఒమన్ అత్యున్నత పురస్కారం..

ఒమన్, డిసెంబర్ 18 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. ఒమన్ పర్యటనలో ఉన్న ఆయనకు ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్ గురువారం ప్రదానం చేశారు. గతంలో క్వీన్ ఎలిజబెత్, నెల్సన్ మండేలా వంటి ప్రపంచ ప్రఖ్యాత నేతలకు మాత్రమే ఈ పురస్కారం దక్కింది. రెండు రోజుల క్రితమే ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న మోదీకి ఇది 29వ అంతర్జాతీయ గౌరవం కావడం విశేషం. అంతకుముందు, ప్రధాని మోదీ, ఒమన్ సుల్తాన్ హైథమ్ మధ్య మస్కట్‌లోని అల్ బరకా ప్యాలెస్‌లో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఇరు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (CEPA) కుదరడాన్ని ఇరువురు నేతలు ఒక కీలక మైలురాయిగా అభివర్ణించారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు. భారత్, ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతుందని నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ 'మైత్రీ పర్వ్' కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే, ఇండియా-ఒమన్ బిజినెస్ ఫోరమ్‌లో పాల్గొని, ఒమన్ వ్యాపారవేత్తలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

# కేసీఆర్ క్రియాశీలక రాజకీయాల్లో లేరు

హైదరాబాద్, : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్రియాశీలక రాజకీయాల్లో లేరని, అందుకే ఆయనతో ఎలాంటి ప్రయోజనం లేదని గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు ఇచ్చారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని ఆయన అన్నారు. 12 వేలకు పైగా గ్రామపంచాయతీల్లో 7,500కు పైగా కాంగ్రెస్ విజయం సాధించిందని తెలిపారు. కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఒక్క ఎన్నికను కూడా గెలవలేదని ఆయన విమర్శించారు. హరీశ్ రావు నాయకత్వం మార్చాలని చూస్తున్నారని, అందుకే కేటీఆర్ ఇప్పుడు కాంగ్రెస్ గురించి ఆలోచించడం లేదని అన్నారు. స్పీకర్ నిర్ణయాలు నచ్చకపోతే కోర్టులు ఉన్నాయని, అక్కడికి వెళ్లవచ్చని సూచించారు. కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో మూడు రోజులు చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని అన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. 12,702 పంచాయతీలకు 7,527 చోట్ల కాంగ్రెస్, 808 చోట్ల కాంగ్రెస్ రెబల్స్ గెలుపొందారని వెల్లడించారు. 66 శాతం ఫలితాలు కాంగ్రెస్, రెబల్స్ సాధించారని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఈ ఎన్నికల్లో ఒక కూటమిగా పోటీ చేస్తే, బీఆర్ఎస్ పార్టీకి 3,511, బీజేపీకి 710 స్థానాలు వచ్చాయని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించినట్లుగా అర్థమైందని అన్నారు. 94 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పంచాయతీ ఎన్నికలు జరిగితే 87 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించిందని అన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే పెద్దల సూచనను తాము పాటిస్తామని, ప్రతిపక్షాలకు మాత్రం ఇంకా అహంకారం తగ్గలేదని విమర్శించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అందిస్తున్న సంక్షేమ పథకాలు ఈ విజయానికి కారణమని అన్నారు.

# ఏపీలో జనాభా సంక్షోభం... రెండో బిడ్డను కంటే ప్రోత్సాహకాలు ఇచ్చే యోచన!

ఆంధ్రప్రదేశ్‌లో జనాభా సంక్షోభం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు (TFR) ఆందోళనకరంగా పడిపోవడంతో, భవిష్యత్తులో తలెత్తే తీవ్ర పరిణామాలను నివారించేందుకు ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఫ్రాన్స్, హంగేరీ వంటి దేశాల్లో అమలు చేస్తున్న తరహాలో 'రెండో బిడ్డను కనేవారికి' ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. గురువారం అమరావతిలో జరిగిన 5వ కలెక్టర్ల సదస్సులో ఈ ఆందోళనకరమైన గణాంకాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ బయటపెట్టారు. జాతీయ సగటు 28.4 ఏళ్లతో పోలిస్తే, ఏపీలో సగటు వయసు 32.5 ఏళ్లుగా ఉందని, ఇది రాష్ట్రం వేగంగా వృద్ధాప్యం వైపు వెళ్తోందనడానికి సంకేతమని ఆయన వివరించారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5కు పడిపోయిందని, ఇది సాధారణంగా ఉండాల్సిన 2.1 కంటే చాలా తక్కువని తెలిపారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే 2040 నాటికి రాష్ట్రంలో వృద్ధుల జనాభాపై ఆధారపడే వారి సంఖ్య భారీగా పెరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. తగ్గుతున్న సంతానోత్పత్తి రేటుపై తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకప్పుడు కుటుంబ నియంత్రణకు పెద్దపీట వేసిన తాము, ఇప్పుడు జనాభాను పెంచేందుకు ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. "అభివృద్ధి చెందిన దేశాలు ఎదుర్కొంటున్న సమస్యనే ఇప్పుడు మనం ఎదుర్కొంటున్నాం. పనిచేయని వయసు జనాభా పెరుగుతోంది. ఇకపై పిల్లల్ని కనేలా కుటుంబాలను ప్రోత్సహించడంపైనే మన దృష్టి ఉండాలి," అని సౌరభ్ గౌర్ స్పష్టం చేశారు. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం వినూత్న ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో 'ఫెర్టిలిటీ కాలేజీలు' ఏర్పాటు చేయనున్నట్లు గౌర్ తెలిపారు. వీటి ద్వారా సంతానలేని దంపతులకు ప్రభుత్వ సహాయంతో ఐవీఎఫ్ చికిత్స అందించి, జనాభా సుస్థిరతకు దోహదపడతామన్నారు. దీంతో పాటు మహిళల ఉపాధిని ప్రోత్సహించేందుకు కార్యాలయాల్లో తప్పనిసరిగా క్రెచ్ (శిశు సంరక్షణ కేంద్రాలు) ఏర్పాటు చేయడం ద్వారా వారి భాగస్వామ్యాన్ని 31 శాతం నుంచి 59 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల రాష్ట్ర జీఎస్‌డీపీ 15 శాతం మేర పెరిగే అవకాశం ఉందని అంచనా.

# 2 గంటలకు బాంబు పేలుతుంది

హైదరాబాద్, : హైదరాబాద్ నగరంలోని నాంపల్లి సీబీఐ కోర్టుకు బాంబు బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. మధ్యాహ్నం రెండు గంటలకు కోర్టు ప్రాంగణంలో బాంబు పేలుతుందని ఆ సందేశంలో పేర్కొన్నారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులను కోర్టు నుంచి బయటకు పంపించి, బాంబు నిర్వీర్య దళాలతో తనిఖీలు చేపట్టారు. కోర్టు లోపల, పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుండి వచ్చిన ఈ బెదిరింపు సందేశంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కోర్టు ప్రాంగణంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. బెదిరింపులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## విచారణలో నోరు విప్పిన ఐబొమ్మ రవి.. పైరసీ ఎలా చేశాడో చెప్పేశాడు!

హైదరాబాద్, : ఐబొమ్మ వెబ్ సైట్ నిర్వాహకుడు రవి కేసు విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పోలీసుల విచారణలో అతడు సినిమా పైరసీకి పాల్పడిన విధానాన్ని వెల్లడించాడు. టెలిగ్రామ్ ఛానల్ ద్వారా కొత్త సినిమాల పైరసీ ప్రింట్లతో వ్యాపారం చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈరోజు జరిగిన విచారణలో పైరసీకి సంబంధించిన కీలక వివరాలను రవి వెల్లడించాడు. కేవలం సాధారణ ప్రింట్లే కాకుండా, ఏకంగా క్యాబ్ నెట్‌వర్క్‌ను, శాటిలైట్ లింక్‌ను హ్యాక్ చేసి సినిమాలను హెచ్‌డీ ఫార్మాట్‌లో రికార్డు చేసినట్లు తెలిపాడు. ఈ విధంగా పైరసీ చేసిన సినిమాలను అమ్మేందుకు 'హెచ్‌డీ హబ్' పేరుతో ప్రత్యేకంగా ఒక టెలిగ్రామ్ ఛానల్ ఏర్పాటు చేసినట్లు చెప్పాడు.

# అల్లాపురం ఉప సర్పంచ్ గా బోయిని లింగస్వామి యాదవ్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అల్లాపురం ఉపసర్పంచ్ ఎన్నిక గురువారం జరిగింది. బీఆర్ఎస్ బలపరిచిన 1వ వార్డు సభ్యుడు బోయిని లింగస్వామి యాదవ్ ను ఉప సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ నూతన ఉప సర్పంచ్ బోయిని లింగస్వామి యాదవ్ మాట్లాడుతూ తన మొదటి అడుగులోనే వార్డు సభ్యునిగా 52ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం పట్ల సంతోషంగా ఉందన్నారు. తనకు ఓట్లు వేసి సహకరించిన వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ గా తన ఎన్నికలకు సహకరించిన వార్డు సభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానన్నారు.

# మొక్కల రాజశేఖర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు, సింగరేణియన్, దేశ ప్రధాని నరేంద్ర మోదీ జయప్రశంసలు అందుకున్న మొక్కల రాజశేఖర్ పుట్టినరోజు సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రకృతి హరిత దీక్ష కురాలు నైనిక రజువా ఆయనకు మొక్కను అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. నిరంతరంగా, క్రమం తప్పకుండా ప్రతిరోజూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న మొక్కల రాజశేఖర్ సేవలను పలువురు కొనియాడారు.అలాగే ఆయన వద్ద ప్రకృతి హరిత దీక్ష తీసుకున్న సభ్యులు మొక్కలు నాటి, మొక్కలను బహుమతిగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఆయనకు పద్మశ్రీ అవార్డు లభించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మొక్కల రాజశేఖర్ మాట్లాడుతూ "ప్రకృతి హరిత దీక్ష భావితరాలకు రక్ష. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రపంచ పర్యావరణాన్ని కాపాడాలి" అని విజ్ఞప్తి చేశారు.

# ప్రజల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సతిమణికి వినతి



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ లో ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలను పరిష్కరించాలని గురువారం కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షులు ఊట్ల చంద్ర రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సతీమణి నందితను కలిసి వివరించారు. అనంతరం బస్తీలోని పలు సమస్యలను అమెకు తెలియజేసారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న తీరును ఆమెకు ఆయన వివరించారు.

# పీపుల్ పహాడ్ సర్పంచ్ గా పులనగారి నాగేశ్వరి అశ్విన్ కుమార్ గౌడ్

- **519ఓట్ల భారీ మెజారిటీ**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం పీపల్ పహాడ్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులనగారి నాగేశ్వరి అశ్విన్ కుమార్ గౌడ్ విజయం సాధించారు. సమీప అభ్యర్థిపై 519ఓట్ల మెజారిటీతో గెలుపొందడం విశేషం. ఈ సందర్భంగా సర్పంచ్ పులనగారి నాగేశ్వరి అశ్విన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఓట్లు వేసిన గ్రామస్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. 519భారీ మెజారిటీ సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తనపై గ్రామస్తులు పెట్టిన నమ్మకాన్ని అభివృద్ధి రూపంలో చూపిస్తానన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు. గ్రామ ప్రజలందరి సహకారంతో సమిష్టిగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానన్నారు. తనకు ఓట్లు వేసి గెలిపించిన గ్రామస్తులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని నాయకులు, ప్రజలు పలువురు సర్పంచ్ గా భారీ విజయం సాధించిన పులన గారి నాగేశ్వరి అశ్విన్ కుమార్ గౌడ్ లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# శాంతియుత వాతావరణంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు

**- ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పూర్తిగా శాంతియుత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించగలిగామని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహించారని పేర్కొన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో, దూరదృష్టి, సమర్థవంతమైన నాయకత్వం, కట్టుదిట్టమైన పర్యవేక్షణతో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, శాంతియుతంగా సాగిందని తెలిపారు. ఎన్నికలకు ముందు సమగ్ర ప్రణాళికలు రూపొందించి, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు, మార్గదర్శక సూచనలు ఇవ్వడం ద్వారా ప్రతి పోలింగ్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు సజావుగా కొనసాగాయని వివరించారు. క్షేత్రస్థాయిలో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ, చిన్న సమస్యలకే ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించగలిగామని చెప్పారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం, చెక్‌పోస్టులు, పికెట్స్, పెట్రోలింగ్, ఫ్లాగ్ మార్చ్‌లు




నిర్వహించడం, రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌ను బైండోవర్ చేయడం వంటి చర్యలు శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభావవంతంగా నిలిచాయని తెలిపారు. చలిని లెక్కచేయకుండా విధి నిర్వహణలో పాల్గొని ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా సహకరించిన ప్రతి పోలీసు సిబ్బందికి అభినందనలు తెలిపారు. పోలీస్ సేవలు ప్రజలకు అండగా, రక్షణగా నిలుస్తున్నాయనే నమ్మకం ప్రజలలో మరింత బలపడుతోందని పేర్కొన్నారు. సేవాభావం, క్రమశిక్షణ, నిబద్ధతతో రాబోయే ఎన్నికలలోను, శాంతిభద్రతల పరిరక్షణలోను, నేరాల నియంత్రణలోను, ప్రజల భద్రతలోను అందరూ సమన్వయంతో సేవలందిస్తామని అన్నారు.



# జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా లాభం ఏంటి..?

* **ఏజెన్సీ ప్రాంత వైద్యంపై ప్రభుత్వానికి చిన్నచూపా..?**
* **కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో వసతుల కొరత – తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రోగులు, డాక్టర్లు, వైద్య సిబ్బందితో ఆమె మాట్లాడి, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం కవిత మాట్లాడుతూ కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్లు, మందులు, మౌలిక వసతుల తీవ్ర కొరత ఉన్నప్పటికీ డాక్టర్లు, హాస్పిటల్ సిబ్బంది ఎంతో నిబద్ధతతో రోగులకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. కానీ ప్రభుత్వం నుంచి రావాల్సిన సదుపాయాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కొత్తగూడెం లాంటి ప్రాంతానికి కనీసం 650 నుంచి 750 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. అయితే కొత్త ఆసుపత్రి నిర్మాణం చేయకుండా పాత భవనాన్ని విస్తరించుకుంటూ పోవడం వల్ల సరైన వసతులు కల్పించలేకపోతున్నారని విమర్శించారు. కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ వంటి కీలక విభాగాలకు రోగులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. పిడియాట్రిక్ విభాగంలో తొమ్మిది మంది డాక్టర్లు అవసరమైతే కేవలం ఇద్దరే పనిచేస్తున్నారని తెలిపారు.ఎక్స్‌రే, ఎంఆర్ఐ స్కాన్‌లను ఏర్పాటు చేయడానికి కూడా తగిన స్థలం లేకపోవడం దురదృష్టకరమన్నారు. కేర్ టేకర్లు, సెక్యూరిటీ, శానిటేషన్, స్వీపర్లు, క్లీనర్లు కలిపి సుమారు 250 మంది సిబ్బంది పనిచేస్తున్నప్పటికీ వారికి ఉద్యోగ భద్రత లేదని, కనీసం హెల్త్ పాలసీ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన ఈ సిబ్బందికి ఇప్పటికీ ఎలాంటి గుర్తింపు, అభివృద్ధి లేకపోవడం బాధాకరమన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోందని పేర్కొన్న కవిత, ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ కొత్తగూడెం ఆసుపత్రిపై సరైన చొరవ చూపడం లేదని విమర్శించారు. కొత్తగూడెంలో 750 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి మంత్రులు ముందుకు రావాలని ఆమె డిమాండ్ చేశారు.

# అల్లాపురం సర్పంచ్ గా టేకుల మంజుల దిలీప్ రెడ్డి

**- హోరాహోరీ పోరులో ఒక్క ఓటుతో సర్పంచ్ పదవి కైవసం**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామపంచాయతీ ఎన్నిక హోరాహోరీగా జరిగింది. సర్పంచ్ అభ్యర్థులుగా స్వతంత్ర అభ్యర్థిగా కొలను శిల్ప శ్రీనివాస్ రెడ్డి (ఉంగరం గుర్తు), బీఆర్ఎస్ బలపరిచిన బిజెపి అభ్యర్థిగా టేకుల మంజుల దిలీప్ (కత్తెర గుర్తు), కాంగ్రెస్ అభ్యర్థిగా అర్ధ మమత వెంకట్ రెడ్డి (బ్యాట్ గుర్తు), స్వతంత్ర అభ్యర్థిగా రాసాల మౌనిక అశోక్ యాదవ్ (ఫుట్ బాల్ గుర్తు) బరిలో నిలిచారు. ముగ్గురు అభ్యర్థులు పోటాపోటీగా ఓట్లు తెచ్చుకున్నారు. తీవ్ర ఉత్కంఠగా సాగిన ఎన్నికల్లో టేకుల మంజుల దిలీప్ రెడ్డిని విజయం వరించింది. మొత్తం 557ఓట్లు పోలవగా, అందులో కొలను శిల్ప శ్రీనివాస్ రెడ్డికి 171ఓట్లు, అర్ధ మమత వెంకట్ రెడ్డికి 180ఓట్లు, టేకుల మంజుల దిలీప్ రెడ్డికు 181ఓట్లు, రాసాల మౌనిక అశోక్ యాదవ్ కు 24ఓట్లు రాగా, ఒక ఓటు చిత్తయింది. ఉత్కంఠంగా సాగిన ఓట్ల లెక్కింపులో ఒక్క ఓటుతో టేకుల మంజుల దిలీప్ రెడ్డి విజయం సాధించారు. అల్లాపురం గ్రామ వార్డు సభ్యులు 1వ వార్డు సభ్యునిగా బోయిని లింగస్వామి యాదవ్ (బీఆర్ఎస్), 2వ వార్డు యంజాల లింగస్వామి (స్వతంత్ర), 3వ వార్డు సుర్కంటి స్వాతి (కాంగ్రెస్), 4వ వార్డు సామ సుమిత్ర (బీజేపీ), 5వ వార్డు యంజాల శ్రీకాంత్ (స్వతంత్ర), 6వ వార్డు వల్లపు ప్రసన్న యాదవ్ (బీఆర్ఎస్), 7వ వార్డు యంజాల అమృత (బీఆర్ఎస్), 8వ వార్డు భూతం లింగస్వామి యాదవ్ (బీఆర్ఎస్)లు గెలుపొందారు.

* **ఉప సర్పంచ్ గా 1వ వార్డు సభ్యుడు బోయిని లింగస్వామి యాదవ్ ను ఎన్నుకున్నారు.**






* **ఆదరించి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు:**
* **టేకుల మంజుల దిలీప్ రెడ్డి**

అల్లాపురం గ్రామ సర్పంచ్ గా తనను ఆదరించి ఓట్లు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. పార్టీలకతీతంగా గ్రామస్తులందరికీ అందుబాటులో ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానన్నారు.

# జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో బీసీలకు బీఎస్పీ 50శాతం రిజర్వేషన్లు

**- తగరం సుభాష్ చంద్రబోస్**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రాబోయే ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తుందని ఆ పార్టీ మునుగోడు నియోజకవర్గం అధ్యక్షుడు తగరం సుభాష్ చంద్రబోస్ తెలిపారు.చౌటుప్పల్ మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్ మంచాల శ్రీకాంత్ ల ఆదేశాల మేరకు రానున్న జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో బీసీలకు అవకాశం కల్పిస్తుందన్నారు. బీసీల జనాభాకు అనుగుణంగా ఏ పార్టీ రిజర్వేషన్లు కల్పించడం లేదని ఆరోపించారు. బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించడానికి బిఎస్పీ పార్టీ ముందుకు వస్తుందన్నారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా పోటీ చేసేందుకు సన్నాహకాలు చేస్తుందన్నారు. బీసీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బిజెపి తీర్థం పుచ్చుకున్న 3వ వార్డు సభ్యుడు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ 3వ వార్డు సభ్యుడు ఐలపురం సంజీవ్ బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఐలపురం సంజీవ్ 3వ వార్డు సభ్యునిగా విజయం సాధించారు. ఈ మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మట్ట వెంకటేశ్వర్ రెడ్డి సమక్షంలో ఆయన బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మట్ట వెంకటేశ్వర్ రెడ్డి ఐలపురం సంజీవ్‌కు పార్టీ కండువా కప్పి బిజెపిలోకి ఆహ్వానించారు.

# చిలాప్ చెడ్ సర్పంచ్ గా అనిల్ కుమార్..

- **యువ నేత వైపే మొగ్గు చూపిన చిలాప్ చెడ్ ప్రజలు...**
- **ఎమ్మెల్యే సునీత రెడ్డిని కలిసిన పాలకవర్గ సభ్యులు**



అందోలు, ప్రజాస్ఫూర్తి:చిలప్ చెడ్ గ్రామ బిఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ గా అనిల్ కుమార్ ముదిరాజ్ భారీ మెజార్టీతో అఖండ విజయం సాధించారు. మండలంలోని మెజార్టీలో మొదటి స్థానంలో నిలిచాడు. గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉంటూ..వారి సమస్యను తన సమస్యగా భావించి గ్రామ ప్రజలకు చేరువయ్యారు. యువ సర్పంచుగా రికార్డు సృష్టించారు. మూడో విడతలో భాగంగా జరిగిన ఎన్నికల్లో గ్రామంలో మొత్తం 10వార్డు స్థానాలను బిఆర్ఎస్ బలపరిచిన అనిల్ కుమార్ ప్యానెల్ కైవసం చేసుకున్నాయి. గ్రామంలో ఉదయం నుంచి అనిల్ విజయం పక్క అంటూ యువకులు కేరింతలు కొట్టారు. మధ్యాహ్నం కౌంటింగ్ ప్రారంభం కాగానే సమీప కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి నీ దాటుకొని 531 భారీ మెజార్టీతో గెలుపొందారు. రాత్రికి గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం నర్సాపూర్ లోని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి స్వగృహంలో సర్పంచి అనిల్ కుమార్, గ్రామ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దుర్గారెడ్డి, వార్డు సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సన్మానించి శభాష్ అంటూ కొనియాడారు. పాలకవర్గ సభ్యులు కూడా ఆమెను సన్మానించారు.

# ఎల్లమ్మబండ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తొలగిస్తాం

* **ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేపట్టి ఎల్లమ్మబండ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తొలగిస్తామని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన ఎల్లమ్మబండ ప్రాంతంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామారం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో నష్టపోయిన వారికి టి.డి.ఆర్ లు అందేలా ప్రయత్నం చేసి, శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ తో , సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి నష్టపరిహారం ఇపిస్తానని అన్నారు. ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్య తో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు అని అన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగిందన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్డు మధ్యలో అడ్డంకిగా ఉన్న ఎలక్ట్రికల్ స్థంబాలను త్వరితగతిన స్థాన భ్రంశం చేయాలన్నారు. రోడ్డు డివైడర్ మధ్యలో సుందరికరణ పనులు చేపట్టాలని, మౌలిక వసతుల కల్పనలో అలసత్వం ప్రదర్శించకుండా రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# చలి గజగజ... ఏకంగా 3.8 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత



తెలుగు రాష్ట్రాల్లో చలి పంజా విసురుతోంది. ముఖ్యంగా ఏపీని చలి వణికిస్తోంది. ఏపీలోని అన్ని జిల్లాలో నిన్న కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. కోస్తాంధ్రలో సాధారణం కంటే 4 డిగ్రీల వరకు టెంపరేచర్స్ పడిపోయాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడలో నిన్న 3.8 డిగ్రీల అత్యంత కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యిందని ఏపీ వాతావరణశాఖ పేర్కొంది. ఇక తెలంగాణలోనూ చలి అసాధారణంగా పెరిగింది. ఏకంగా 13 జిల్లాలో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు అయినట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ లో నిన్న 5.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయింది. కాగా రెండు తెలుగు రాష్ట్రాల్లో చలికి తోడు విపరీతమైన పొగమంచు కూడా కురుస్తుండటంతో ఉదయం 9 దాటుతున్నావాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు తీవ్రమైన చలి, పొగమంచు వలన అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని వైద్యారోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

# సీఎం రేవంత్‌కు, మంత్రులకు పడటం లేదు: ఎమ్మెల్సీ

ప్రజా పాలన పేరిట అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాఫియాలాగా పని చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ గాజుల రామారంలో 11ఎకరాలు భూ కబ్జా చేశారని.. ఆయన పార్టీ మారిన తరువాత ఆ భూమిని ల్యాండ్ రెగ్యులరైజ్ చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌కు భజన చేస్తే చాలు, పార్టీ ఫిరాయింపులు చేస్తే చాలు భూ బదలాయింపు అవుతున్నదని పేర్కొన్నారు. అమ్మిన భూమికి నకిలీ డాక్యుమెంట్ సృష్టించి.. భూ భారతిలో అరికెపూడి గాంధీ పేరు మీద ఎంట్రీ చేశారని ఆరోపించారు. మాధవరం కృష్ణారావు ప్రభుత్వానికి వినతులు ఇచ్చారని.. సీసీఎల్ఏకు, సీఎస్, జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్, హైడ్రా, విజిలెన్స్ కమిషనర్, కూకట్‌పల్లి కమిషనర్‌కు, ఇతర పోలీస్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఇంతవరకు చర్యలు తీసుకోలేదని అన్నారు. ఐడీపీఎల్ భూమి మీద విచారణ అంటూ ఒక్క సర్వే నంబర్ మీద మాత్రమే చేస్తున్నారని.. అరికెపూడి గాంధీ ల్యాండ్ కబ్జాపై ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. దమ్ముంటే గాజులరామారంలో 307సర్వే నంబర్‌లో ఉన్న భూమి వద్దకు పోదామా అని నిలదీశారు. భూ ఆక్రమణలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎంకు, మంత్రులకు పడడం లేదని.. హిల్ట్ పాలసీ డాక్యుమెంట్ మంత్రులే బయటకు ఇచ్చారని తెలిపారు.

# కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలు అమలయ్యే వరకూ వెంటాడుతాం

* **ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా జాగృతి జనం బాట**
* **జాగృతి జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల "జాగృతి జనం బాట" కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జాగృతి జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యేలు పార్టీ మారారనే అంశానికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవని చెప్పిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తీర్పు అత్యంత దారుణమని వ్యాఖ్యానించారు. స్పీకర్ తీర్పు రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఈ నిర్ణయం ఉందని మండిపడ్డారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని తెలిపారు.పార్టీ మారిన వారు నైతికంగా రాజీనామా చేయాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేసిన తర్వాత తాను పార్టీకి రాజీనామా చేశానని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీల అమలుపై ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కవిత విమర్శించారు. మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు దానిపై ఊసే లేదని అన్నారు. రెండు వేల నుంచి నాలుగు వేల రూపాయల వరకు పెన్షన్లు పెంచుతామని చెప్పినప్పటికీ ఒక్క రూపాయి కూడా పెంచలేదని ఎద్దేవా చేశారు.పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యాయని, ఇకపై కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకోసం ఆడబిడ్డలంతా కలిసి ప్రభుత్వం వెంట పడతామని హెచ్చరించారు. పెన్షన్లు వెంటనే పెంచాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు బతుకమ్మ చీరలు అందించాలని డిమాండ్ చేశారు. కేవలం డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న మహిళలకు మాత్రమే చీరలు ఇవ్వడం దారుణమని, గ్రూపుల్లో లేని మహిళల ఓట్లు అవసరం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం నిజమైన ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం జిల్లాలోని ప్రతి గ్రామంలో జాగృతి జెండాను ఎగరేస్తామని స్పష్టం చేశారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌లను ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆరోపించిన కవిత, సింగరేణిలో ఏర్పాటు చేస్తున్న మెడికల్ బోర్డులు ఎవరి కోసం అనే సందేహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో జాగృతి ఆధ్వర్యంలో సింగరేణి భవన్ ముట్టడి చేసిన తర్వాత మెడికల్ బోర్డు పెట్టడం అన్యాయమని అన్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు.బొగ్గు బాయి బిడ్డల బతుకులు బాగుపడాలని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, తాను వేలాది మందికి సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పించానని తెలిపారు. హాస్పిటల్ వ్యవస్థ, స్కూల్ వ్యవస్థ, డిపెండెంట్ ఉద్యోగాలను ఖచ్చితంగా పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ, అందుకోసం తెలంగాణ జాగృతి నిరంతరం పోరాటం చేస్తుందని కవిత స్పష్టం చేశారు.



# అంబేద్కర్ ని అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అవమానపరిచింది

* **వివేకానందనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : అంబేద్కర్ ని అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అవమానపరిచారని వివేకానందనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం, స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీ కి నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేర్లింగంపల్లి నియోజకవర్గం లోని వివేకానంద నగర్ డివిజన్ రిక్షా పుల్లర్స్ కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద స్థానిక నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీ ,మిగిలిన 9 మంది శాసనసభ్యులు బిఆర్ఎస్ పార్టీపై గెలిచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కాంగ్రెస్ కండువాలు వేసుకొని తర్వాత మీడియా ప్రతినిధులకు కూడా కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తేనే అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీకి వెళ్లిన మని చెప్పిన వీడియోలు కూడా అందరికీ తెలిసినవే ఇవన్నీ కూడా స్పీకర్ కి కూడా తెలుసు ఇన్ని రోజులు స్పీకర్ మీద నమ్మకం ఉండే మరి ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , బిఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి పోయిన పదిమంది ఎమ్మెల్యేల ఒత్తిడికి లోనై ఈ విధంగా తీర్పు తీసుకున్నారని, ఇప్పటికైనా బిఆర్ఎస్ పార్టీపై గెలిచిన స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీ బిఆర్ఎస్ లోనే ఉన్నారని అనుకుంటే తెలంగాణ భవన్లో డిసెంబర్ 21 వ తారీఖున జరిగే బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంట్ సభ్యులు అందరూ హాజరవుతున్నారు కావున అక్కడికి వచ్చి నిరూపించుకోవాల్సిందిగా కోరుతున్నాము అక్కడికి రాని పక్షంలో కాంగ్రెస్ లోనే ఉన్నారని అనుకోవడం జరుగుతుంది ఇప్పటికైనా మీరు కాంగ్రెస్ లో ఉన్నారని అనుకుంటే బిఆర్ఎస్ సభ్యత్వానికి బిఆర్ఎస్ నుంచి ఎన్నికైన శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ టికెట్ పై గెలిచి ప్రజలకు సేవ చేయాలని కోరుతున్నాం.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, మాచర్ల భద్రయ్య, వేముల ఆంజనేయులు, జగదీష్ గౌడ్, ప్రవీణ్ ,విక్రం, మధు, యశ్వంత్, రవీందర్ రావు, సత్యనారాయణ, రవి, పర్వతాలు సతీష్ కుమార్, రామ్ చందర్, కొండలరావు, విద్యాసాగర్, జై, మల్లయ్య, శ్రీనివాస్, రాజశేఖర్, నరేష్, మల్లేష్ ,రమేష్ రావు, వెంకన్న,జగదీష్, రామారావు, కె.వి. రావు,సాయి, సంతోష్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# వార్డు మెంబర్లుగా తల్లీ కొడుకులు





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఒకే ఇంట్లోని తల్లీ కొడుకులు వార్డు మెంబర్లుగా విజయం సాధించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామానికి చెందిన యంజాల అమృత, యంజాల శ్రీకాంత్ లు తల్లీకొడుకులు. యంజాల శ్రీకాంత్ స్వతంత్ర అభ్యర్థిగా 5వ వార్డు నుంచి పోటీ చేసి 4ఓట్లతో విజయం సాధించారు. యంజాల అమృత బీఆర్ఎస్ అభ్యర్థిగా 7వ వార్డు నుంచి బరిలో నిలిచి 29ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

# కిషన్ రెడ్డి ఇంట్లో బీజేపీ ఎంపీల కీలక భేటీ

* **తెలంగాణ ఎంపీలకు ప్రధాని మోదీ చురకల నేపథ్యంలో ప్రాధాన్యం**



తెలంగాణ బ్యూరో: గురువారం రాత్రి ఢిల్లీలోని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి నివాసంలో తెలంగాణ బీజేపీ ఎంపీలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అరవింద్, రఘునందన్, కొండా విశ్వేశ్వరరెడ్డి, గొడం నగేశ్ తో పాటు ఏపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్ కృష్ణయ్య పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, పార్టీ కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత పకడ్బందీగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, టీ బీజేపీ చీఫ్ రామచంద్రరావు నేతృత్వంలో తెలంగాణలో పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయడం తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ, మునిసిపాలిటీ ఎన్నికలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో.. ప్రత్యేకమైన వ్యూహంతో పనిచేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

**ప్రధాని క్లాస్... కిషన్ రెడ్డి మాస్ నేపథ్యంలో...**

ఒడిశా లాంటి చోట కూడా బీజేపీ గెలిచిందని, మరి మీ దగ్గర ఏమైందంటూ తెలంగాణ బీజేపీ ఎంపీలపై ప్రధాని మోదీ ఇటీవల పార్టీ ఎంపీల సమావేశంలో సీరియస్ అయ్యారు. తెలంగాణలో బీజేపీ కన్నా ఎంఐఎం బలంగా పని చేస్తున్నదని, కమల దళం కన్నా ఒవైసీ సోషల్ మీడియా టీమ్ యాక్టివ్‌గా ఉందన్నారు. 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి ఏం చేస్తున్నారని, ఇప్పటికైనా పార్టీ నేతలు తీరు మార్చుకోవాలని ఆయన హెచ్చరించారు. ప్రధానంగా సోషల్ మీడియాలో మరింత యాక్టివ్‌గా ఉండాలని కీలక సూచన చేశారు. అయితే ప్రధాని మోదీ సమావేశం అంశంపై మీడియాకు లీకులిచ్చారంటూ తమ పార్టీ ఎంపీల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. మీటింగ్‌లో చర్చించిన విషయాలు బయటకు చెప్పవద్దని మోదీ స్వయంగా ఆదేశించారని... అయినా ఎవరో మెంటలోళ్లు అక్కడ జరిగింది ఒకటైతే... మీడియాకు మరోలా చెప్పారని, వాళ్లెవరో చెబితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కిషన్ రెడ్డి ఇంట్లో ఎంపీలందరికి సమావేశం కీలక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

# ప్రభుత్వ అంశాల్లో టీపీసీసీ చీఫ్ జోక్యం.. సరికాదంటున్న సీనియర్లు

ఈ మధ్య పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యవహారశైలిపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన మాట్లాడిన అంశాలు అటు పార్టీలో, ఇటు ప్రభుత్వ వర్గాల్లో గందరగోళం సృష్టిస్తున్నాయి. భవిష్యత్ లో సైతం ఆయన ఇదే విధంగా వ్యవహరిస్తే వివాదాలు తలెత్తే ప్రమాదం ఉందని లీడర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిసెంట్ గా డిల్లీ పర్యటనలో మహేశ్ కుమార్ మీడియాతో పిచ్చాపాటిగా పార్టీ, ప్రభుత్వంలోని అంతర్గత అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. పార్టీలోని అంశాలపై అధ్యక్షుడి హోదాలో ఏమైన మాట్లాడవచ్చు. కాని ప్రభుత్వ అంశాలపై ఆయన తన అభిప్రాయాలను బయటికి చెప్పడం సరికాదని సీనియర్ లీడర్లు సూచిస్తున్నారు.



**కేబినెట్ ప్రక్షాళన సీఎం పరిధిలోని అంశం**

మంత్రివర్గం ప్రక్షాళన చేయడమా? ఒకవేళ చేస్తే ఎవరిని తీసుకోవాలి?ఎవరిని తప్పించాలి?ఏ మంత్రులు శాఖలు మార్చాలి?అనే అంశాలు పూర్తిగా సీఎం రేవంత్ రెడ్డి పరిధిలోనివి. ఈ విషయాలపై ఆయన అధిష్టానాన్ని సంప్రదించి తుది నిర్ణయం తీసుకుంటారు. అయితే పార్టీ అధ్యక్షుడి హోదాలో ఆయనకు ప్రభుత్వంలో జరిగే పరిణామాలు తెలుస్తుంటాయి. ప్రక్షాళన చేసే ముందు అధిష్టానం కూడా ఆయన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని చాన్స్ ఉంటుంది. అయితే ఈ విషయాలు ఆయనకు తెలిసినా బయటికి చెప్పకుండా మహేశ్ కుమార్ జాగ్రత్త పడాల్సి ఉంటే బాగుండునని సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. అలాకాకుండా కేబినెట్ ప్రక్షాళన ఉంటుందని చెప్పడం వల్ల ప్రభుత్వ వ్యవహారాల్లో ఆయన జోక్యం చేసుకుంటున్నారనే సంకేతాలు వెళ్లాయని అంటున్నారు. అలాగే ఐఏఎస్ అధికారుల పనితీరుపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నిజానికి అధికారుల పనితీరును అంచనా వేయాల్సింది సీఎం,మంత్రులు. కాని మహేశ్ కుమార్ గౌడ్ బహిరంగంగా అధికారుల పనితీరు పై కామెంట్స్ చేయడం వల్ల అపోజిషన్ కు అస్త్రాలు అందించినట్లేనని కామెంట్స్ ఉన్నాయి.

# కోర్టు సమయం వృథా చేస్తారా?.. హీరాగ్రూప్‌నకు భారీ జరిమానా విధించిన హైకోర్టు

హైదరాబాద్: నౌహీరా షేక్‌కు చెందిన హీరా గ్రూప్‌నకు హైకోర్టు భారీ జరిమానా విధించింది. రూ.5 కోట్ల జరిమానా విధించిన న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక... ఆ మొత్తాన్ని 8 వారాల్లో పీఎం సహాయ నిధికి జమ చేయాలని హీరా గ్రూప్‌ను ఆదేశించారు. కోర్టును తప్పుదోవ పట్టించేలా పిటిషన్ దాఖలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి.. భారీ జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పేదల నుంచి పెట్టుబడి పేరుతో డబ్బులు వసూలు చేసి తిరిగి చెల్లించలేదని హీరా గ్రూప్‌తో పాటు.. నౌహీరా షేక్ పైనా ఈడీ అధికారులు పీఎంఎల్ఏ కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు హీరా గ్రూప్‌నకు చెందిన 59 ఆస్తులను అటాచ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ ఆస్తులను వేలం వేసేందుకు ఈడీ అధికారులు MSTC లిమిటెడ్ వెబ్ సైట్‌లో వివరాలు ఉంచారు. ఈనెల 26న వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈడీ అధికారులు సరిగా వేలం నిర్వహించడం లేదని, ఆస్తుల విలువ తక్కువగా చూపించారని నౌహీరా షేక్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వేలాన్ని



రద్దు చేయాలని కోరారు. అప్పటి వరకు వేలం వేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వేలం వేస్తున్నట్లు ఈడీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరువైపులా వాదనలు విన్న జస్టిస్ నగేశ్ భీమపాక.. పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు పిటిషన్లు వేసి కోర్టు సమయ వృథా చేస్తున్నారన్న న్యాయమూర్తి.. ఈ మేరకు హీరాగ్రూప్‌నకు రూ.5కోట్ల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసు
## సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో మరో సిట్

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్‌ఆధ్వర్యంలో సీనియర్ ఐపీఎస్ అధికారులతో మరో సిట్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సిట్‌లో రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, సిద్దిపేట కమిషనర్ ఎస్.ఎం.విజయ్ కుమార్, మాదాపూర్ డీసీపీ రితురాజ్, మహేశ్వరం డీసీపీ నారాయణ్‌రెడ్డి, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ రవీందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ అదనపు డీసీపీ కేఎస్ రావు, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, టీజీ న్యాబ్ డీఎస్పీ శ్రీధర్, హైదరాబాద్ మెట్రోలో పనిచేస్తున్న నాగేందర్ సభ్యులుగా ఉన్నారు.



### హైదరాబాద్ బెళగావి
## ప్రత్యేక రైలుకు తప్పిన ప్రమాదం

శంకర్‌పల్లి: హైదరాబాద్ నుంచి కర్ణాటకలోని బెళగావి వెళ్తున్న ప్రత్యేక రైలు(07043)కు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. రైలు రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ సమీపంలోకి రాగానే మొదటి జనరల్ బోగీ కింద మంటలు చెలరేగాయి. ప్రయాణికుల సమాచారంతో వెంటనే అప్రమత్తమైన రైల్వే సిబ్బంది మంటలు ఆర్పివేశారు. బ్రేక్ జామ్ అవడంతో నిప్పురవ్వలు చెలరేగి మంటలు వచ్చినట్టు గుర్తించారు. మంటలు ఆర్పిన తర్వాత నిపుణుల సూచనల మేరకు రైలు బయల్దేరింది.



### టాంజానియాలో
## నల్గొండ జిల్లా వాసి మృతి



మునుగోడు: టాంజానియాలో జియాలజిస్టుగా పనిచేస్తున్న తెలంగాణ వాసి గుండెపోటుతో మృతి చెందారు. నల్గొండ జిల్లా మునుగోడు మండలం పలివెల గ్రామానికి చెందిన బడుగు రాజు (38) మూడేళ్ల కిందట టాంజానియా రాజధాని దారుస్సలాం నగరానికి వెళ్లి జియాలాజిస్టుగా పనిచేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌కు వచ్చి నాలుగు నెలల పాటు కుటుంబ సభ్యులతో గడిపి.. రెండు నెలల కిందట తిరిగి టాంజానియా వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న క్రమంలో గురువారం రాజుకు గుండెపోటు వచ్చి మృతిచెందినట్లు స్థానికంగా ఉన్న తెలుగు వారు.. పలివెల గ్రామంలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారాన్ని చేరవేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో.. ఆ దేశ రాయబారితో మాట్లాడించి మృతదేహన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. వారితో పాటు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సైతం తనవంతు ప్రయత్నం చేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. వారి సహకారంతో రెండు రోజుల్లో పలివెల గ్రామానికి రాజు మృతదేహం చేరుకునే అవకాశం ఉంది. ఉపాధి కోసం వెళ్లిన రాజు త్వరలో తన కుటుంబాన్ని సైతం టాంజానియా తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలిసింది. ఇంతలోనే మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేక కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు(10) ఉన్నారు.

## ప్రేమ వివాహం..
## కట్నం కోసం భార్యను హతమార్చిన భర్త

తాండూరు పట్టణం: ప్రేమ వివాహం చేసుకొని ఏడాది కూడా దాటకముందే అదనపు కట్నం కోసం భార్యను కొట్టి చంపాడో భర్త. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని సాయిపూర్‌కు చెందిన పరమేశ్‌తో అనూష(22)కు 8 నెలల క్రితం వివాహమైంది. ఇద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అనంతరం భర్త, అత్త మామలతో కలిసి ఉంటోంది. కొన్ని రోజులుగా కట్నం తేవాలని అత్త, మామ, భర్త వేధించడం ప్రారంభించారు. 3 రోజుల క్రితం భర్త పరమేశ్ దాడి చేయడంతో అనూషకు గాయాలయ్యాయి. తల్లి, సోదరుడు తీసుకెళ్లి చికిత్స చేయించారు. గురువారం సోదరుడితో కలిసి పుట్టింటికి వెళుతున్న అనూషను పరమేశ్ వచ్చి ఇంటికి తీసుకెళ్లాడు. ఇంటికి వెళ్లాక మరోసారి ఇద్దరూ గొడవ పడ్డారు. భర్త పరమేశ్ తీవ్రంగా కొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తెలంగాణ గ్రూప్–3 ఫలితాలు విడుదల

తెలంగాణలో 1,370 గ్రూప్ 3 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక జాబితా విడుదలైంది. ఈ మేరకు ఎంపికైన అభ్యర్థులతో ప్రొవిజినల్ నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ గురువారం తన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. గతేడాది నవంబర్‌లో గ్రూప్3 ఉద్యోగ నియామక పరీక్ష నిర్వహించగా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2.67లక్షల మంది అభ్యర్థులు రాసిన విషయం తెలిసిందే. గతంలో జనరల్ ర్యాంకింగ్స్, మెరిట్ జాబితాలను విడుదల చేసిన అధికారులు.. వెబ్ ఆప్షన్లు నమోదు అనంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసి తాజాగా ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచారు.




ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లు, ఎంపికైన పోస్టు కోడ్, ప్రాంతం వివరాలను ఈ జాబితాలో పేర్కొన్నారు. మొత్తంగా 1,388 గ్రూప్3 పోస్టులు ఖాళీగా ఉండగా.. ప్రస్తుతం 1370 పోస్టులకు మాత్రమే అభ్యర్థుల ఎంపిక జాబితాను విడుదల చేశారు. తదుపరి వెరిఫికేషన్ కోసం ఒక పోస్టును హోల్డ్ చేసిన అధికారులు.. మరో 17 పోస్టుల ఖాళీలకు సంబంధించిన ఫలితాలు తర్వాత వెల్లడిస్తామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఖతార్ నుంచి వచ్చి.. ఒక్క ఓటుతో సర్పంచ్‌గా గెలిచి..





బుగ్గారం: మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జగిత్యాల జిల్లాలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. బుగ్గారం మండలం సిరికొండలో ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలవగా.. ఖతార్ నుంచి ఏడాదిన్నర క్రితం స్వగ్రామానికి వచ్చిన పంచిత ధర్మరాజు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి సర్పంచ్‌గా ఎన్నికవడం చర్చనీయాంశంగా మారింది. అయితే, ఈ ఎన్నికల్లో ఆయన ఒక్క రూపాయి కూడా పంచకుండానే గెలవడం, అదీ తన సమీప ప్రత్యర్థిపై ఒకే ఒక్క ఓటుతో నెగ్గడం మరింత ఆసక్తిని రేపింది.

**సర్పంచ్‌గా పోటీ చేద్దామనే వచ్చా..**

మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. నా రెండేళ్ల ప్రాయంలోనే తండ్రిని కోల్పోయాను. మా అమ్మ మల్లమ్మ కష్టపడి నన్ను ఇంటర్ వరకు చదివించింది. నాకు భార్య, ఇద్దరు కొడుకులు. ఉపాధి కోసం 15 ఏళ్ల పాటు ఖతార్‌లో ఉన్నాను. గ్రామంలో సర్పంచ్‌గా పోటీ చేద్దామని 18 నెలల క్రితమే స్వగ్రామానికి వచ్చాను. అక్కడ తొలుత కూలీగా, డ్రైవర్‌గా, ట్రాన్స్‌పోర్టు ఉద్యోగిగా పని చేశాను. తెలంగాణ ప్రజాసమితి అసోసియేషన్ ద్వారా గల్ఫ్‌లో నివసిస్తున్న వారికి, బాధితులకు సహాయంగా పలు కార్యక్రమాలు నిర్వహించాను.

*** ఎన్నికల్లో రూపాయి పంచకుండా గెలిచా**

అన్నీ తెలిసిన వాళ్లు, సామాజిక స్పృహ ఉన్నవారు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. నాలాంటి వాళ్లు రాజకీయాల్లోకి వస్తే ఆదరిస్తారన్న ఆలోచనతోనే రంగంలోకి దిగాను. గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టాను. ఈ ఎన్నికల్లో ఒక్క రూపాయి కూడా పంచలేదు. గ్రామ స్థాయిలో అన్ని సమస్యలకు సర్పంచ్ బాధ్యుడైనప్పటికీ దాన్ని మరిచి వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయి. పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉంది. ప్రజలు రోగాల బారినపడుతున్నారు. అనర్హులకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. వీటితో పాటు అనేక సమస్యలను గుర్తించాను.

**ఇలా ముందుకెళ్తాను..**

ప్రజల భద్రతే లక్ష్యంగా ప్రతి కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాను. ప్రతి వీధినీ పరిశుభ్రంగా ఉండేలా కృషి చేస్తాను. ఓపెన్ జిమ్ ఏర్పాటు, నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం చేయడం, మహిళలకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇప్పించడం వంటి అంశాలపై దృష్టి పెట్టి ముందుకు సాగుతా. వీటితో పాటు పచ్చదనం పరిశుభ్రత, పర్యావరణహితం, అర్హులైనవారికి సంక్షేమ పథకాలు అందేలా చూడటం, పరిశుభ్రమైన తాగునీరు అందించడంతో పాటు సాగునీటి సమస్య పరిష్కారానికీ కృషిచేస్తాను.

## రూ.15వేల కోట్ల విలువైన భూమి తెలంగాణ ప్రభుత్వానిదే
## సుప్రీంకోర్టు కీలక తీర్పు

దిల్లీ: తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. రూ.15వేల కోట్ల విలువ చేసే భూములకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు ఇచ్చింది. హైదరాబాద్ వనస్థలిపురం సమీపంలోని సాహెబ్‌నగర్ వద్ద ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ అటవీశాఖదేనని తేల్చింది. దాదాపు 20 ఏళ్లుగా ఈ భూ వివాదం కొనసాగుతోంది. ఈ భూమిపై యాజమాన్య హక్కులు కోరుతూ నిజాం, సాలార్ జంగ్,



మీరాలం వారసులమంటూ పలువురు న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశారు. గతంలో పిటిషన్లు వేసిన 260 మందికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల ధర్మాసనం.. ఇది పూర్తిగా అటవీ భూమి అని రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి హక్కులు కల్పిస్తూ తీర్పు ఇచ్చింది. తీర్పు వెలువడిన 8 వారాల్లో రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించింది. నోటిఫికేషన్ ప్రతిని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి పంపాలని ధర్మాసనం ఆదేశించింది.

# కనిపించని హిమపాతం.. పర్యాటకుల కోసం జీపుల్లో మంచు తెచ్చి!

కులూ: హిమాచల్ ప్రదేశ్‌లోని పర్వత ప్రాంతంలో హిమపాతాన్ని ఆస్వాదించేందుకు వందలాది మంది పర్యాటకులు వస్తుంటారు. అయితే, ఈసారి అక్కడ ఇంకా మంచు కురవకపోవడం పర్యాటక రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. దీంతో టూరిజంపై ఆధారపడిన స్థానిక వ్యాపారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎత్తైన ప్రాంతాల నుంచి జీప్‌లలో మంచును తీసుకొచ్చి ఆయా టూరిస్టు



ప్రాంతాల్లో పరుస్తున్నారు. లాహౌల్ లోయలోని గ్రామ్‌ఫూ, షింకూ లా పాస్‌లోని సహజ హిమపాతాన్ని చూసేందుకు ఏటా వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. ఈ క్రమంలో మనాలిలో ఇంకా మంచు కురవడం లేదని, జీపుల్లో తరలిస్తున్నారని పేర్కొంటూ ఓ యువతి సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టడం చర్చనీయాంశమైంది. దీనిపై స్థానిక వ్యాపారులు స్పందిస్తూ.. పర్యాటకులను దృష్టిలో ఉంచుకొని అధికారుల నిబంధనలకు లోబడే ఈ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పర్వత ప్రాంతాలకు కేవలం కొన్ని వాహనాలనే అనుమతిస్తున్నారని, దీంతో సొంత వాహనాలు లేని పర్యాటకులకు ఇబ్బందిగా మారిందన్నారు. అటువంటి వారిని దృష్టిలో ఉంచుకొని, ఫొటోలు తీసుకోవడంతోపాటు మంచును ఆస్వాదించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అక్కడకు వచ్చిన టూరిస్టులు కూడా వీరి ఏర్పాట్లతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# 'కర్మశ్రీ'కి మహాత్మా గాంధీ పేరు

**: మమతా బెనర్జీ**



జాతీయ ఉపాధి హామీ పథకం పేరును 'వీబీ జీ రామ్ జీ'గా మార్చడంపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా మండిపడ్డారు. కొన్ని రాజకీయ పార్టీలు జాతీయ నాయకులను గౌరవించకపోయినా తాము గౌరవిస్తామని భాజపాను పరోక్షంగా ఉద్దేశిస్తూ అన్నారు. ఈ క్రమంలో తమ రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథకం 'కర్మశ్రీ'కి మహాత్మా గాంధీ పేరు పెట్టనున్నామని ప్రకటించారు. "కేంద్ర ఉపాధి హామీ పథకం పేరు మార్చాలని నిర్ణయించినందుకు సిగ్గుపడుతున్నా. ఎందుకంటే.. నేనూ ఈ దేశ పౌరురాలినే. మనం ఇప్పుడు జాతిపితను కూడా మరచిపోతున్నాం" అని ఓ బిజినెస్ కాంక్లేవ్‌లో దీదీ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో చేపడుతున్న కర్మశ్రీ పథకానికి మహాత్మా గాంధీ పేరు పెడుతున్నామన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో దీదీ ఈ విధంగా మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి వచ్చే నిధులను కేంద్రం అడ్డుకుంటోందని ఆరోపించిన దీదీ.. కర్మశ్రీ పథకం కింద లబ్ధిదారులకు 75 రోజులపాటు పనిని కల్పిస్తున్నామన్నారు. భవిష్యత్తులో దీనిని 100 రోజులకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కేంద్ర నిధులు ఇవ్వనప్పటికీ రాష్ట్ర నిధులతోనే దీనిని కొనసాగిస్తున్నామని చెప్పారు.

## అణు ఇంధన రంగంలోకి ప్రైవేట్..

# కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

దిల్లీ: అణు ఇంధన రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా శాంతి పేరుతో రూపొందించిన ఈ బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలపగా.. గురువారం రాజ్యసభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. ఈ బిల్లుపై చర్చకు మంత్రి జితేంద్రసింగ్ సమాధానమిస్తూ.. ఇతర పునరుత్పాదక ఇంధన వనరులతో పోలిస్తే అణుశక్తి ద్వారా నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ఆస్కారం ఉంటుందని చెప్పారు. భద్రత విషయంలో ఆందోళన అక్కర్లేదన్నారు. రేడియేషన్ వల్ల ప్రజలకు హాని జరిగినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టంచేశారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుదుత్పత్తిని సాధించాల్సి ఉందని గుర్తుచేశారు. ప్రైవేటు భాగస్వాముల్ని అనుమతించడం వల్ల పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయని అధికారపక్షం చెబుతోంది. రాజ్యసభలో ఈ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రైవేటు భాగస్వామ్యాన్ని విపక్ష ఎంపీలు తప్పుబట్టారు. దేశ సార్వభౌమత్వం, భద్రతపై దీనివల్ల ప్రభావం పడుతుందని తృణమూల్ ఎంపీ సాగరిక ఘోష్ ఆరోపించారు. ఈ బిల్లు చాలా ప్రమాదకరమని డీఎంకే ఎంపీ పీ విల్సన్



విమర్శించారు. ప్రైవేటుకు లాభాలు కట్టబెట్టడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేశారు. పునరుత్పాదక ఇంధనం ఉండగా.. న్యూక్లియర్ పవర్‌పై అంత ఆసక్తి దేనికని ఆప్ ఎంపీ సందీప్ పాఠక్ ప్రశ్నించారు. ఇదే భాజపా గతంలో భారత్ అమెరికా అణు ఒప్పందాన్ని వ్యతిరేకించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాల్లో అణు ఇంధన రంగం ప్రభుత్వం చేతిలోనే ఉందని, అమెరికాలో మాత్రమే 80 శాతం మేర ప్రైవేటు భాగస్వామ్యం ఉందని పేర్కొన్నారు. అమెరికా మోడల్ మనలాంటి దేశాలకు ఏమాత్రం సరికాదన్నారు. ఈ బిల్లును జేపీసీకి పంపించాలని బీజేడీ ఎంపీ ముజిబుల్లాఖాన్ డిమాండ్ చేశారు.

## హెచ్1బీ దరఖాస్తుదారులకు కష్టకాలం..

# అక్టోబరు దాకా ఎదురుచూడాల్సిందేనా..!

అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీతో భారత హెచ్ 1బీ దరఖాస్తుదారులకు కష్టకాలం ఎదురైంది. ఈ విధానం వల్ల వీసా కోసం దరఖాస్తుదారులు వచ్చే ఏడాది అక్టోబరు దాకా ఎదురుచూడాల్సిన పరిస్థితి తలెత్తింది. చాలామంది దరఖాస్తుదారుల వీసా అపాయింట్‌మెంట్లు 2026 అక్టోబరు నెలాఖరుకు వాయిదా పడినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. డిసెంబరు జనవరిలో జరగాల్సిన హెచ్ 1బీ, హెచ్ 4 వీసా ఇంటర్వ్యూలను వచ్చే ఏడాది ఫిబ్రవరిమార్చికి రీషెడ్యూల్ చేసినట్లు ఇటీవల అమెరికా




ఎంబసీ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రక్రియ మరింత ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. వీరి ఇంటర్వ్యూ తేదీలను ఇప్పుడు అక్టోబరు నెలకు వాయిదా వేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను క్షుణ్ణంగా స్క్రీనింగ్ చేసేందుకు అదనపు సమయం పడుతోందని, అందువల్లే ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధికారులు చెబుతున్నారు. దీంతో దరఖాస్తుదారుల పరిస్థితి గందరగోళంలో పడింది. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగాలు సాధించి.. ప్రయాణాల కోసం టికెట్లు బుక్ చేసుకున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. డిసెంబరు 15వ తేదీ నుంచి హెచ్ 1బీ, హెచ్ 4 వీసా దరఖాస్తుదారులకు సోషల్ వెట్టింగ్‌ను అమెరికా ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందుకు వీలుగా దరఖాస్తుదారులు తమ సోషల్ మీడియా ఖాతాలను ప్రైవేటు నుంచి పబ్లిక్‌కు మార్చుకోవాలని అమెరికా విదేశాంగ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ భద్రతలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అగ్రరాజ్యం తెలిపింది.

## వారికి తాగడానికి నీళ్లే లేవు..

# బాటిళ్లకు నాణ్యత కోసం పిటిషనా? :సుప్రీంకోర్టు

దిల్లీ: మంచినీళ్ల బాటిళ్లకు అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మన దేశంలోని చాలా ప్రాంతాల్లో ప్రజలకు కనీస తాగు నీరే అందడం లేదని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. ఇది కేవలం 'లగ్జరీ వ్యాజ్యమే' అంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ నాణ్యతా ప్రమాణాలను మెరుగుపర్చేలా ఆదేశాలు జారీ చేయాలంటూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "ఇది



అర్బన్‌రిచ్ మనస్తత్వంతో వేసిన పిటిషనే. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా మందికి తాగు నీటి సరఫరా సరిగా లేదు. వారు శుద్ధి చేయని జలాలపై ఆధారపడుతున్నారు. ముందు వారి సంగతి ఆలోచిద్దాం. నీళ్ల బాటిళ్ల నాణ్యత గురించి తర్వాత చూద్దాం" అని ధర్మాసనం తెలిపింది. "అమెరికా, జపాన్, ఈయూ మార్గదర్శకాలను మన దేశంలో ప్రవేశపెట్టగలమా? అనే విషయాన్ని మీరు ఆలోచించుకోవాలి. భారత్‌లోని వాస్తవిక పరిస్థితులను తెలుసుకోవాలి. గాంధీజీ దేశానికి వచ్చినప్పుడు.. ఆయన చాలా మారుమూల ప్రాంతాల్లో పర్యటించారు. మీరు కూడా అలా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలను సందర్శించండి. అక్కడి ప్రజలు తాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో చూడండి. అప్పుడు మీకు మన దేశం అంటే ఏంటో అర్థమవుతుంది" అని పిటిషనర్‌కు సుప్రీం కోర్టు ధర్మాసనం సూచించింది.




## ఆ గ్రామాల పేరులో 'బెండ'..

# ఎటుచూసినా ఈ పంటే నిండా!

బిహార్‌లోని సమస్తిపుర్ జిల్లా మోర్వా బ్లాకులో గల హర్పుర్ భిండీ, బశహీ భిండీ గ్రామాలు పలురకాల బెండకాయల సాగుకు ప్రసిద్ధి. తొమ్మిది వేలకు పైగా జనాభా ఉన్న ఈ గ్రామాల్లో పండించే బెండకాయలకు ముజఫ్ఫర్‌పుర్, వైశాలీ మార్కెట్లలో మంచి డిమాండు ఉంటుంది. వీటి కొనుగోళ్లకు ప్రత్యేకంగా వేలం పాట పెడతారు. ఇక్కడి నుంచి ఉత్తర బిహార్‌లోని మోతీపుర్ కూరగాయల మార్కెటుకు సైతం బెండకాయలు సరఫరా చేస్తారు. ఈ ఊర్ల పేర్లు కూడా బెండకాయ (భిండీ) పదంతోనే ఉంటాయి. వంకాయ, క్యాబేజీ, బఠానీ, ముల్లంగి, గుమ్మడి, ఆకుకూరల వంటి ఇతర కూరగాయలు పండించినా.. రెండు గ్రామాల్లో కలిపి 75 శాతం రైతులు బెండకాయలనే సాగు చేస్తారు. హర్పుర్ భిండీ రైతు సూర్యనారాయణ్ సింగ్ మాట్లాడుతూ.. తమ గ్రామంలో జనవరి తర్వాత ఎటుచూసినా బెండకాయల సాగే కనిపిస్తుందన్నారు. హైబ్రిడ్ బెండకాయలు తక్కువ శ్రమతో మంచి దిగుబడిని ఇస్తాయని, వీటి సాగు ఎక్కువ లాభదాయకంగానూ ఉంటుందన్నారు. పర్భణీ క్రాంతి, కాశీ క్రాంతి, సాయాజీ హైబ్రిడ్ ఓక్రా 2211 వంటి రకాలు మంచి లాభాలను ఇస్తాయని తెలిపారు.

## 'ఉపాధి' స్థానంలో 'జీ రామ్ జీ'కి లోక్‌సభ ఆమోదం..

# బిల్లు ప్రతులు చించేసిన విపక్ష ఎంపీలు

దిల్లీ: 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (ఎంజీనరేగా)ను రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్(గ్రామీణ్' (వీబీ జీ రామ్ జీ) బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తంచేశాయి. వారి ఆందోళన నడుమ స్పీకర్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లు కు ఆమోదం లభించింది. ఈ సమయంలో విపక్ష ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టాయి. కొందరు ప్రతిపక్ష నేతలు 'వీబీ జీ రామ్ జీ' బిల్లు ప్రతులను చించి విసిరేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. అంతకుముందు బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాల ఆరోపణలకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బదులిచ్చారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలకు అనుగుణంగానే మోదీ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. "బాపూ సిద్ధాంతాలను కాంగ్రెస్ సర్కారు చంపేసింది. కానీ, ఎన్డీయే ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోంది. పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, స్వచ్ఛభారత్ మిషన్, ఆయుష్మాన్ భారత్ వంటి



పథకాలతో గాంధీజీ కలలను మేం సాకారం చేస్తున్నాం" అని తెలిపారు.

**ఎన్నికల కోసమే గాంధీ పేరు చేర్చి..**

ఈ సందర్భంగా గత కాంగ్రెస్ పాలనపై ఆయన విరుచుకుపడ్డారు. "తొలుత ఉపాధి హామీ పథకానికి NREGA అనే పేరు ఉండేది. ఆ తర్వాత 2009లో లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరు చేర్చింది. అంతేకాదు.. వారి హయాంలో ఈ పథకం అమలులో అనేక లోటుపాట్లు చోటుచేసుకున్నాయి. కూలీలపై ఎక్కువ ఖర్చు చేసి.. మెటీరియల్ కొనుగోలుకు తక్కువ వెచ్చించారు" అని చౌహాన్ మండిపడ్డారు. పేరు మార్పుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శలను ప్రస్తావిస్తూ.. గతంలోనే అనేక పథకాలకు కాంగ్రెస్ గాంధీనెహ్రూ పేర్లు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. పల్లె ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల ఉత్పాదకత, అభివృద్ధి లక్ష్యాలుగా దాదాపు రెండు దశాబ్దాల కిందట 'ఎన్ఆర్ఈజీఏ' చట్టాన్ని 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చింది. తర్వాత 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా పేరు మార్చారు.



# కష్టకాలం ముగిసింది: ఇండిగో సీఈవో

ఇండిగో సంక్షోభం సమయంలో తమకు అండగా నిలిచిన సిబ్బందికి ఆ విమానయాన సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ ధన్యవాదాలు తెలిపారు. ఇండిగో ఉద్యోగులను ఉద్దేశిస్తూ ఆయన ఓ వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎయిర్‌లైన్ రోజువారీ సర్వీసులు పునరుద్ధరించామని వెల్లడించారు. 'చాలా పెద్ద సవాలు నుంచి బయటపడ్డాం. ఇండిగో ఉద్యోగులు, మేము ఒకరికొకరం మద్దతుగా నిలిచి ఈ తుపాన్‌ను ఎదుర్కొన్నాం. బలంగా నిలబడ్డాం. మాకు మద్దతుగా నిలిచిన పైలట్లు, క్యాబిన్, ఎయిర్‌పోర్టు సిబ్బంది, కస్టమర్ సర్వీస్.. ఇలా అన్ని విభాగాలకు ధన్యవాదాలు. ఇండిగోకు అండగా నిలిచారు' అని రాసుకొచ్చారు. విమానాల రద్దుకు ఇదీ కారణం అని చెప్పలేమని, అనేక అంశాలు ప్రభావితం చేశాయన్నారు. ఇకపై ఉద్యోగులు ప్రశాంతంగా ఉండాలని, వారు బాధ్యతలపై దృష్టిపెట్టాలని కోరారు. సంక్షోభానికి సంబంధించి వస్తున్న ఊహాగానాలకు దూరంగా ఉండాలని అభ్యర్థించారు. అంతరాయాల సమయంలో ఉద్యోగులు ఎదుర్కొన్న సవాళ్లు, ఇబ్బందుల గురించి తెలుసుకునేందుకు సీఈవోతో సహా నాయకత్వ బృందం పనిచేస్తోందని తెలిపారు.

# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

భారీ ఒడిదుడుకుల మధ్య ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

వరుసగా నాలుగో రోజూ నష్టాల్లోకి జారుకున్న సెన్సెక్స్

ఐటీ షేర్లు లాభపడినా ఇతర రంగాల షేర్లకు నిరాశ

అమెరికా ఎఫ్‌డీఏ దెబ్బతో కుప్పకూలిన సన్ ఫార్మా షేరు

అంతర్జాతీయ పరిణామాలపై మదుపరుల దృష్టి



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం ట్రేడింగ్‌ను ఫ్లాట్‌గా ముగించాయి. రోజంతా తీవ్ర ఒడుదొడుకులకు లోనైన సూచీలు, చివరికి స్వల్ప నష్టాలతో సరిపెట్టుకున్నాయి. ఐటీ షేర్లలో బలమైన కొనుగోళ్లు కనిపించినప్పటికీ.. ఆటో, మెటల్, ఫార్మా రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్లను కిందకు లాగింది.

ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 78 పాయింట్లు నష్టపోయి 84,482 వద్ద స్థిరపడింది. దీంతో సెన్సెక్స్ వరుసగా నాలుగో రోజు కూడా నష్టాల్లో ముగిసినట్లయింది. ఈ నాలుగు రోజుల్లో సూచీ సుమారు 785 పాయింట్లు కోల్పోయింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ కేవలం 3 పాయింట్ల స్వల్ప నష్టంతో 24,815.55 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో సెన్సెక్స్ 542 పాయింట్ల పరిధిలో కదలాడింది. ఒక దశలో 84,238 కనిష్ఠ స్థాయికి పడిపోయి, ఆ తర్వాత 84,780 గరిష్ఠ స్థాయికి చేరింది.

సెన్సెక్స్ షేర్లలో టీసీఎస్ దాదాపు 2 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ 1.7 శాతం చొప్పున లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, యాక్సిస్ బ్యాంక్ కూడా లాభాల్లో ముగిశాయి. మరోవైపు, సన్ ఫార్మా షేరు 2.7 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. కంపెనీకి చెందిన బస్కా ప్లాంట్‌పై యూఎస్ డ్రగ్ రెగ్యులేటర్ ప్రతికూల నివేదిక ఇవ్వడం ఇందుకు కారణమైంది. టాటా స్టీల్, పవర్ గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, ఎల్అండ్‌టీ, ఎన్టీపీసీ షేర్లు కూడా నష్టపోయాయి.

రంగాల వారీగా చూస్తే ఐటీ ఇండెక్స్ 1 శాతానికి పైగా లాభపడగా, పవర్ సెక్టార్ 1 శాతం, ఆటో రంగం 0.5 శాతం నష్టపోయాయి. ఇక అమెరికా ద్రవ్యోల్బణం, నిరుద్యోగ గణాంకాలు, ఇతర అంతర్జాతీయ కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల నిర్ణయాల కోసం మదుపరులు వేచి చూస్తున్నారని విశ్లేషకులు తెలిపారు. నిఫ్టీకి 25,700 వద్ద మద్దతు, 25,900 వద్ద నిరోధం ఉందని అంచనా వేస్తున్నారు.

## యజమానులకు ఈపీఎఫ్ఓ గుడ్ న్యూస్...

ఉద్యోగుల నమోదుకు 6 నెలల సమయం

ఉద్యోగుల నమోదుకు
'ఈఈఎస్-2025' పేరుతో ఈపీఎఫ్ఓ ప్రత్యేక పథకం

నవంబర్ నుంచి ఆరు నెలల పాటు యజమానులకు అవకాశం

2017 జూలై నుంచి 2025 అక్టోబర్ మధ్య చేరని ఉద్యోగులకు లబ్ధి

కేవలం రూ.100 నామమాత్రపు జరిమానాతో పాత బకాయిల చెల్లింపు




**న్యూఢిల్లీ:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తాజాగా సంస్థల యజమానులకు ఒక కీలకమైన అవకాశాన్ని కల్పించింది. గతంలో వివిధ కారణాల వల్ల తమ ఉద్యోగులను ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) పరిధిలోకి తీసుకురాలేని సంస్థల కోసం 'ఎంప్లాయిస్ ఎన్‌రోల్‌మెంట్ స్కీమ్ (ఈఈఎస్)-2025' పేరుతో ఒక ప్రత్యేక పథకాన్ని గురువారం ప్రకటించింది. దీని కింద అర్హులైన ఉద్యోగులను స్వచ్ఛందంగా పీఎఫ్ ఖాతాలో నమోదు చేయడానికి యజమానులకు ఆరు నెలల సమయం ఇచ్చింది.

ఈ పథకం 2025 నవంబర్ నుంచి ఆరు నెలల పాటు అమల్లో ఉంటుంది. 2017 జూలై 1 నుంచి 2025 అక్టోబర్ 31 మధ్య కాలంలో పీఎఫ్ పరిధిలోకి రాని ఉద్యోగులకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పాత బకాయిలను సులభంగా చెల్లించవచ్చని ఈపీఎఫ్ఓ సూచించింది.

ఈ పథకం కింద యజమానులకు భారీ ఊరట కల్పించారు. గతంలో ఉద్యోగి వాటాను జీతం నుంచి మినహాయించని పక్షంలో, యజమాని కేవలం తన వాటా, వర్తించే వడ్డీ, పరిపాలనా ఛార్జీలతో పాటు నామమాత్రంగా రూ.100 జరిమానా చెల్లిస్తే సరిపోతుంది.

ఇప్పటికే విచారణ ఎదుర్కొంటున్న సంస్థలు కూడా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని ఈపీఎఫ్ఓ స్పష్టం చేసింది. 'అందరికీ సామాజిక భద్రత' అనే జాతీయ లక్ష్యాన్ని సాధించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ పథకంపై యజమానుల్లో అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, ఎస్ఎంఎస్, ఈ-మెయిల్స్ ద్వారా సమాచారం అందిస్తామని పేర్కొంది.

## మగువలకు షాక్..

మళ్లీ పెరిగిన సిల్వర్, గోల్డ్ ధరలు



**న్యూఢిల్లీ:** మగువలకు బంగారం ధరలు మళ్లీ షాకిచ్చాయి. మరికొన్ని రోజుల్లో న్యూఇయర్‌లోకి అడుగుపెట్టబోతున్నాం. ధరలు తగ్గుతాయనుకుంటుంటే పరుగులు పెడుతున్నాయి. ఈ సంవత్సరమంతా పుత్తడి ధరలు హడలెత్తించాయి. కొత్త ఏడాది సమయానికి సరికొత్త రికార్డ్ సృష్టించే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే సామాన్యులు కొనేందుకు బెంబేలెత్తిపోతున్నారు. పెళ్లిళ్ల సీజన్లలో పసిడి కొనడం ఎలా బాబోయ్ అంటూ జడిసిపోతున్నారు. ఈరోజు తులం గోల్డ్‌పై రూ.330 పెరిగింది. ఇక కిలో వెండిపై రూ.3,000 పెరిగింది. నిన్న ఒక్కరోజే రూ.11,000 పెరిగింది.

బులియన్ మార్కెట్‌లో ఈరోజు 24 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.330 పెరిగి.. రూ.1,34,840 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ. 300 పెరిగి రూ.1,23,600 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.250 పెరిగి రూ.1,01,130 దగ్గర ట్రేడ్ అవుతోంది.

ఇక సిల్వర్ ధర కూడా హడలెత్తిస్తోంది. ఈరోజు ఏకంగా కిలో వెండిపై రూ.3,000 పెరిగింది. దీంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,11, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నై బులియన్ మార్కెట్‌లో రూ.2,24,000 దగ్గర అమ్ముడవుతోంది. ఇక ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలో మాత్రం కిలో వెండి ధర రూ.2,11, 000 దగ్గర ట్రేడ్ అవుతోంది.

## పొగ మంచు కారణంగా

# లక్నో టీ20 రద్దు..





బీసీసీఐపై విమర్శలు గుప్పించిన శశిథరూర్..!

**లక్నో:** లక్నోలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరగాల్సిన నాలుగో టీ20 మ్యాచ్ పొగమంచు కారణంగా రద్దయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ బీసీసీఐపై విమర్శలు గుప్పించారు. లక్నోలోని ఇలాంటి పరిస్థితుల్లో స్టేడియానికి ఇంటర్నేషనల్ మ్యాచ్‌ను కేటాయించడంపై మండిపడ్డారు. లక్నోలోని భారత్ రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి ఎకానా క్రికెట్ స్టేడియంలో భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరగాల్సిన నాలుగో టీ20 మ్యాచ్ టాస్ వేయకుండానే రద్దయ్యింది. దట్టమైన పొగమంచు కారణంగా విజిబులిటీ తక్కువగా ఉండడంతో మ్యాచ్‌ను నిర్వహించడం కష్టతరంగా మారింది. ఈ మ్యాచ్ రద్దు కావడంతో బీసీసీఐ టూర్ అండ్ ఫిక్చర్స్ కమిటీ మరోసారి విమర్శల పాలైంది. శీతాకాలంలో ఉత్తర, తూర్పు భారత్‌లో డే-నైట్ మ్యాచ్‌లు నిర్వహించడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి.

లక్నోకు మ్యాచ్ కేటాయించిన సమయంలోనే వివాదాస్పదమైంది. వాస్తవానికి, స్టేడియంలో పొగమంచు ఎంత దట్టంగా ఉందంటే.. గాలిలో బంతిని ట్రాక్ చేయడం ఫీల్డర్లకు ప్రమాదకరంగా భావించారు. దాంతో పదే పదే టాస్‌ను వాయిదా వేశారు. అంపైర్లు ఆరుసార్లు మైదానాన్ని పరిశీలించారు. కానీ, చివరకు మ్యాచ్‌ను రద్దు చేయాలని నిర్ణయించారు. టాస్ సాయంత్రం 6.30 గంటలకు వేయాల్సి ఉండగా.. పొగమంచు కారణంగా వాయిదా వేశారు. ఆ తర్వాత రాత్రి 7.30, 8, 8.30, 9.25 గంటలకు మైదానాన్ని పరిశీలించారు. పిచ్, బౌండరీ లైన్ వద్ద ఇద్దరు అంపైర్లు నిలబడి.. ఫీల్డర్లు బంతిని చూడగలరా? లేదా? అనే విషయాన్ని పరిశీలించారు. బీసీసీఐ ఉపాధ్యక్షుడు, యూపీసీఏ అధ్యక్షుడు రాజీవ్ శుక్లా కూడా వాతావరణ పరిస్థితులను అంచనా వేయడానికి మైదానాన్ని పరిశీలించారు. దాంతో పొగ మంచు కారణంగా మ్యాచ్ ఆడడం వీలు కాదని తేలింది.

ఈ క్రమంలో శశిథరూర్ స్పందించారు. లక్నో భారత్-దక్షిణాఫ్రికా నాలుగో టీ20 కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూశారన్నారు. ఉత్తర భారతదేశంలోని చాలా నగరాల్లో దట్టమైన పొగ మంచు, గాలి నాణ్యత సూచీ 411, విజిబిలిటీ తక్కువగ ఉండడం మ్యాచ్ నిర్వహించడం అసాధ్యమన్నారు. ఏక్యూఐ సుమారు 68 ఉన్న తిరువనంతపురంలో ఈ మ్యాచ్ నిర్వహించి ఉండాల్సిందన్నారు. ఇదిలా ఉండగా.. లక్నో స్టేడియంలో మ్యాచ్ కోసం వచ్చిన పలువురు క్రికెటర్లు మాస్కులతో కలిపించారు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మాస్క్ ధరించి కనిపించాడు. దక్షిణాఫ్రికా జట్టు మొదట తేలికపాటి వార్మప్ కోసం మైదానంలోకి వచ్చింది. కానీ, దట్టమైన పొగమంచు కారణంగా డ్రెస్సింగ్ రూమ్‌కు తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం భారత్ సిరీస్‌లో 2-1 ఆధిక్యంలో ఉంది. చివరి మ్యాచ్ డిసెంబర్ 19న అహ్మదాబాద్‌లో జరగనుంది. ఈ మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని జట్టు సిరీస్‌ను గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అదే సమయంలో ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను డ్రాగా ముగించాలని ప్రొటీస్ జట్టు భావిస్తున్నది.

## అర్జెంటీనా ఫ్యాన్ క్లబ్‌పై ఫిర్యాదు చేసిన సౌరవ్ గంగూలీ



**కోల్‌కతా:** కోల్‌కతాకు చెందిన అర్జెంటీనా ఫుట్‌బాల్ ఫ్యాన్ క్లబ్‌పై భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఫిర్యాదు చేశారు. ఆ క్లబ్ ఓనర్ ఉత్తమ్ సాహా తనపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసినట్లు మాజీ క్రికెటర్ ఆరోపించారు. కోల్‌కతా పోలీసు శాఖకు చెందిన సైబర్ సెల్‌కు గంగూలీ తన ఫిర్యాదును ఈ-మెయిల్ చేశారు. ఫ్యాన్ క్లబ్ ఓనర్ ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలు తన పేరు ప్రఖ్యాతను దెబ్బతీశాయని, తనకు మానసిక శాంతిని లేకుండా చేసినట్లు ఆరోపించారు. ఎటువంటి ఆధారాలు లేకుండానే గంగూలీపై ఫ్యాన్ క్లబ్ హెడ్ ఆరోపణలు చేసినట్లు పోలీసు ఆఫీసర్ పేర్కొన్నారు. పరువునష్టం కింద గంగూలీ 50 కోట్ల దావా దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది.

ఓ జర్నలిస్టుతో మాట్లాడుతున్న సమయంలో గంగూలీపై ఫ్యాన్ క్లబ్ ఓనర్ ఉత్తమ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఎంతో కష్టపడి సంపాదించిన తన పేరుప్రఖ్యాతలను దెబ్బతీసే రీతిలో ఫ్యాన్ క్లబ్ అధినేత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు చెప్పారు. ఈవెంట్ ఆర్గనైజర్ సత్రూ దత్త గురించి చెబుతూ.. అతను గంగూలీకి చెంచాగిరి చేస్తాడని ఉత్తమ్ అన్నారు. సౌరవ్ గంగూలీ ఇలాగే అన్నారని, అతని చీటింగ్ గురించి అందరికీ తెలుసు అన్నారు. ఉదయం బీజేపీతో, సాయంత్రం మమతా బెనర్జీతో ఉంటాడని, డబ్బులు ఎక్కడ ఉంటే గంగూలీ అక్కడికి పరుగెత్తుతాడని అన్నారు. బెంగాల్ క్రికెట్‌ను గంగూలీ నాశనం చేశాడని, ఇక భారత జట్టులో బెంగాలీ క్రికెటర్లు ఉండని, అతను అలా చేశాడని ఉత్తమ్ ఆరోపించారు. దీన్ని గంగూలీ ఖండించారు. ఫ్యాన్ క్లబ్ వ్యవస్థాపకుడిపై సుమారు 50 కోట్ల పరువునష్టం కేసు దాఖలు చేసే ఆలోచనలో గంగూలీ ఉన్నట్లు తెలుస్తోంది.

ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనల్ మెస్సీ రాక సమయంలో జరిగిన గందరగోళం నేపథ్యంలో ఉత్తమ్ ఆ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు.

## విదేశీ టీ20 లీగ్స్ ఆడనున్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ..




**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర దేశాల్లోని ఫ్రాంచైజీ టీ20 లీగ్‌లతో పోలిస్తే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు ఉన్న ప్రధాన ప్రత్యేకత భారత ఆటగాళ్ల విషయంలో కనిపిస్తుంది. ప్రస్తుతం రిటైర్ కాకుండా ఉన్న ఏ భారత క్రికెటర్‌కైనా విదేశీ టీ20 లీగ్‌లలో ఆడేందుకు అనుమతి లేదు.. దీని వల్ల విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ లాంటి స్టార్ ఆటగాళ్లు ఆడే ఏకైక ఫ్రాంచైజీ టీ20 టోర్నమెంట్‌గా ఐపీఎల్ నిలుస్తోంది. ఈ నేపథ్యంలో భారత ఆటగాళ్లు భవిష్యత్తులో విదేశీ టీ20 లీగ్‌లలో ఆడే అవకాశం ఉందా అనే ప్రశ్నకు ఐపీఎల్ చైర్మన్ అరుణ్ సింగ్ ధుమాల్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో టీమిండియా ఆటగాళ్లు ఓవర్సీస్ లీగ్‌లలో ఆడే అవకాశం లేదని తేల్చి చెప్పారు. దీనికి ప్రధాన కారణం ప్లేయర్స్ పై అధిక వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ అని ఆయన పేర్కొన్నారు. ఇక, బీసీసీఐ నిబంధనల ప్రకారం అంతర్జాతీయ స్థాయిలో ఆడే ఆటగాళ్లు తప్పనిసరిగా దేశీయ క్రికెట్‌లో కూడా పాల్గొనాల్సి ఉంటుందన్నారు. విజయ్ హజారే, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ వంటి దేశీయ టోర్నీల్లో వారు ఆడాల్సిందేనని చెప్పుకొచ్చారు. దేశంలోనే ఇంత బిజీ క్రికెట్ షెడ్యూల్ ఉండగా, ప్రేక్షకుల ఆదరణ భారీగా ఉన్న నేపథ్యంలో విదేశీ లీగ్‌లలో ఆడే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ సింగ్ వెల్లడించారు.

ఇక, స్టార్ ఆటగాళ్లు విదేశీ లీగ్స్ ఆడటం మరింత కష్టమని ధుమాల్ స్పష్టం చేశారు. కొందరు ప్లేయర్స్ టెస్టులు, వన్డేలు, టీ20లలో ఏదో ఒక ఫార్మాట్లో నిరంతరం ఆడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో విదేశీ లీగ్‌లకు వెళ్లడం అసాధ్యమని అన్నారు. వర్క్‌లోడ్ నియంత్రణ అత్యంత కీలకమని నొక్కి చెప్పారు.

## శుభ్‌మన్ గిల్ గాయపడ్డాడా?

# లేక తప్పించారా..?

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో జరగాల్సిన నాలుగో టీ20 మ్యాచ్‌కు ముందు వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ దూరమయ్యాడు. లక్నోలో బుధవారం జరగాల్సిన మ్యాచ్ భారీ పొగమంచు కారణంగా రద్దయిన విషయం తెలిసిందే. శుక్రవారం జరగాల్సిన మ్యాచ్ నుంచి సైతం గిల్ తప్పుకున్నాడు. సిరీస్ మధ్యలోనే టెస్ట్-వన్డే కెప్టెన్ తప్పుకోవడం అందరినీ షాక్‌కు గురి చేసింది. గిల్ ప్రాక్టీస్ సమయంలో గాయపడినట్లుగా సమాచారం. నిజంగా గిల్ గాయపడ్డాడా? లేకపోతే జట్టు నుంచి తప్పించారా? అంటూ సోషల్ మీడియా వేదికగా పలువురు అభిమానులు సందేహాలు లేవెత్తుతున్నారు.

కోల్‌కతా టెస్ట్ సమయంలో శుభ్‌మన్ గిల్ గాయపడ్డాడు. మెడ గాయం కారణంగా గిల్‌ను కోల్‌కతాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆ తర్వాత దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లోకు సైతం గిల్ దూరమయ్యాడు. టీ20 సిరీస్‌కు ముందు గిల్ ఫిట్‌గా ఉన్నట్లుగా సర్టిఫికెట్ ఇవ్వడంతో బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సర్టిఫికెట్ ఇవ్వడంతో టీ20 సిరీస్‌కు అందుబాటులోకి వచ్చాడు. తాజాగా గాయం కారణంగా టీ20 సిరీస్ కారణంగా మళ్లీ జట్టు నుంచి తప్పుకున్నాడన్న వార్త అభిమానులను ఆందోళనకు గురి చేస్తున్నది. పలువురు అభిమానులు జట్టు నుంచి తప్పించడంపై సెటైరికల్‌గా



స్పందించారు. జట్టు నుంచి తొలగించారా? లేదంటే నిజంగా గాయపడ్డాడా? అంటూ ప్రశ్నించారు.

పలువురు అభిమానులు స్పందిస్తూ.. ఇందులో అర్థం చేసుకోకపోవడానికి రాకెట్ సైన్స్ ఏమీ లేదని.. మ్యాచ్‌లో గిల్‌ను తప్పించారని ఓ అభిమాని ఆరోపించాడు. మళ్లీ జట్టులోకి వస్తాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. మరో యూజర్ స్పందిస్తూ సంజు శాంసన్ లాంటి ఆటగాళ్లు ఇప్పటికీ అవకాశాల కంటే అదృష్టంపైనే ఆధారపడడం విచారకరమని.. అతను స్టాండ్స్‌కే పరిమితమయ్యాడని ఆవేదన వ్యక్తం చేశాడు. గిల్ గాయపడడంతో చివరకు అతనికి అవకాశం వచ్చిందని చెప్పుకొచ్చాడు. ప్లేయర్లు గాయాలు, పరిస్థితుల కారణంగా తాత్కాలికంగా కాకుండా నిజంగా అవకాశాలు దక్కాలని ఆకాంక్షించాడు. అయితే, బీసీసీఐ గిల్ గాయం, ఫిట్‌నెస్‌పై ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు.

వాస్తవానికి గిల్, పేలవమైన ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20ల్లో బ్యాట్‌తో ఆకట్టుకోలేకపోయాడు. భారత జట్టుకు శుభారంభం అందించడంలో విఫలమయ్యాడు. గిల్ వన్డేలు, టెస్టుల్లో రాణించగా.. టీ20 మ్యాచుల్లో మాత్రం పరుగులు చేయలేక ఇబ్బందిపడ్డాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లోని మూడు మ్యాచుల్లో కలిసి కేవలం 32 పరుగులు మాత్రమే చేయగలిగాడు. తొలి మ్యాచ్‌లో 4, రెండో మ్యాచ్‌లో డకౌట్, మూడో మ్యాచ్‌లో కేవలం 28 పరుగులు చేశాడు. సిరీస్‌లో సగటు 10.66 కాగా.. స్ట్రయిక్ రేట్ 103.22గా ఉంది. నాలుగో మ్యాచ్ లక్నోలోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ స్టేడియంలో జరగాల్సిన మ్యాచ్ టాస్ పడకుండానే పొగమంచు కారణంగా రద్దయ్యింది. ప్రస్తుతం భారత్ ఈ సిరీస్‌లో 2-1 ఆధిక్యంలో ఉంది. ఫైనల్ మ్యాచ్ డిసెంబర్ 19న అహ్మదాబాద్‌లో జరుగనున్నది.

# అల్లు అర్జున్ సిస్టర్‌గా మృణాల్ ఠాకూర్?



**టాకీస్:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే భారీ చిత్రంపై బన్నీ ఫ్యాన్స్‌తో పాటు సినీ ఇండస్ట్రీలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచే అధికారిక అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో క్రేజీ టాక్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు సిస్టర్ రోల్‌లో నటించబోతున్నారట. ఈ పాత్ర కథలో చాలా కీలకమైనదిగా, బలమైన ఎమోషనల్ టోన్‌తో సాగుతుందని టాక్. అన్న-చె÷-లెలెల మధ్య బంధం, భావోద్వేగాలను అట్లీ తన మార్క్ స్టైల్‌లో చూపించబోతున్నాడని, ఈ పాత్ర ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేస్తుందని అంటున్నారు. అయితే ఇది అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. నిజంగా మృణాల్ సిస్టర్ రోల్‌లో కనిపిస్తారా? లేక మరో షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో వస్తారా? అన్నది వేచి చూడాల్సిందే. ఇక ఈ సినిమాకు సంబంధించిన మరో హైలైట్ ఏమిటంటే.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణె ఇందులో మెయిన్ హీరోయిన్‌గా నటించనుండగా, జాన్వీ కపూర్ మరో కీలక హీరోయిన్ పాత్రలో కనిపించనుంది. ఒకే సినిమాలో ఇంతమంది స్టార్ హీరోయిన్లు ఉండటం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్రేజ్ పెరుగుతోంది. కథ విషయానికి వస్తే.. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో ఓ డాన్ చుట్టూ తిరిగే పవర్‌ఫుల్ కథను అట్లీ సిద్ధం చేశాడట. యాక్షన్, ఎమోషన్, డ్రామా అన్నీ సమపాళ్లలో ఉండేలా స్క్రిప్ట్‌ను రూపొందించినట్లు సమాచారం. అల్లు అర్జున్‌ను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని విధంగా, ఒక కొత్త షేడ్స్ ఉన్న పాత్రలో చూపించేందుకు అట్లీ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు తెలుస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను సన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ వ్యాల్యూస్ విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా, హాలీవుడ్ రేంజ్‌లో సినిమాను తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారట.



# రవితేజ మూవీకి చిరు వాయిస్ ఓవర్

**టాకీస్:** మాస్ మహారాజా రవితేజ హీరోగా ఇటీవల చాలా చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అందులో ఏ చిత్రం కూడా పెద్దగా ప్రేక్షకులని అలరించలేకపోయింది. ఇప్పుడు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు కిశోర్ తిరుమల దర్శకత్వంలో చేస్తున్న తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఇప్పటికే ఈ సినిమా అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేపుతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తుండగా, ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు బలమైన ఎమోషన్ కూడా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో రవితేజ పాత్రను ప్రత్యేకంగా పరిచయం చేస్తూ మెగాస్టార్ చిరంజీవి తన స్వరంతో వాయిస్ ఓవర్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. సినిమాలో కీలకమైన సందర్భాల్లో రవితేజ పాత్ర గురించి వచ్చే వాయిస్ ఓవర్‌ను చిరంజీవి చెప్పనున్నారని, ఇది కథకు మరింత వెయిట్ పెంచడమే కాకుండా సినిమాపై బలమైన ముద్ర వేయబోతుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవి వాయిస్ ఓవర్ ఉండటం వల్లే సినిమాపై అంచనాలు మరో స్థాయికి చేరుకున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్, శాటిలైట్ హక్కుల డీల్స్ కూడా భారీ ధరకు పూర్తయ్యాయి. ప్రముఖ జీ గ్రూప్ ఈ సినిమా హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. థియేట్రికల్ రిలీజ్ తర్వాత జీ5 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్‌కు రానుండగా, శాటిలైట్ ప్రసారాన్ని జీ తెలుగు మరియు జీ సినిమా ఛానల్స్ నిర్వహించనున్నాయి. జీ స్టూడియోస్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే భీమ్స్ మ్యూజిక్‌పై ఉన్న క్రేజ్‌కు తోడు రవితేజ ఎనర్జీ, కిశోర్ తిరుమల కథనం కలిసి ఈ సినిమాను హిట్ ట్రాక్‌లో నిలబెడతాయనే నమ్మకం వ్యక్తమవుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునే అంశాలతో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సిద్ధమవుతోందని, రిలీజ్ దగ్గరపడే కొద్దీ ఈ సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# హద్దుమీరిన అభిమానం
## నిధి అగర్వాల్‌కు చేదు అనుభవం



టాకీస్: కొన్నిసార్లు అభిమానం హద్దులు దాటితే అది అభిమానంగా కాకుండా వేధింపుగా మారుతుంది. ముఖ్యంగా హీరోయిన్ల విషయంలో కొంతమంది అభిమానుల ప్రవర్తనపై ఇప్పటికే తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తాజాగా ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' హీరోయిన్ నిధి అగర్వాల్‌కు ఇలాంటి షాకింగ్ అనుభవమే ఎదురైంది. ఆమెను చుట్టుముట్టిన అభిమానులు తోసేసుకుంటూ హీరోయిన్‌పైకి ఎగబడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రభాస్ హీరోగా నటిస్తున్న హారర్ కామెడీ థ్రిల్లర్ 'రాజాసాబ్'లో ముగ్గురు హీరోయిన్లలో నిధి అగర్వాల్ ఒకరు. ఈ చిత్రంలోని 'సహన సహన' పాటను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని లూలూ మాల్‌లో సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు నిధి అగర్వాల్‌తో పాటు మరో హీరోయిన్ రిధి కుమార్ కూడా హాజరయ్యారు. సాంగ్ లాంచ్ కార్యక్రమానికి భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈవెంట్ జరుగుతున్నంతసేపూ స్టేజ్ ముందు గుమిగూడిన అభిమానులు తోసుకుంటూనే కనిపించారు. అయితే ఈవెంట్ ముగిసిన తర్వాత పరిస్థితి మరింత దారుణంగా మారింది. నిధి అగర్వాల్ బయటకు వెళ్లే సమయంలో ఒక్కసారిగా అభిమానులు ఆమెపైకి ఎగబడారు. తోసుకుంటూ ముందుకు రావడం, చేతులు వేయడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. సెక్యూరిటీ సిబ్బంది తీవ్రంగా శ్రమించడంతో చివరికి నిధి అగర్వాల్ కారులోకి ఎక్కగలిగింది. కారులో కూర్చోగానే ఆమె 'ఓ మై గాడ్' అంటూ షాక్‌కు గురైన దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది. జనవరి 9న థియేటర్లలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.

# రెండు ఓటీటీల్లోకి సంతాన ప్రాప్తిరస్తు

**టాకీస్:** ప్రేమ, కెరీర్, రిలేషన్‌షిప్స్ మాత్రమే కాదు, ఈతరం చెప్పలేనంత సున్నితమైన సమస్యలతో కూడా సంఘర్షణ పడుతోంది. అందులో ఒకటి సంతాన లేమి. బయటికి మాట్లాడాలంటే సంకోచం, లోపల వేల సందేహాలు, వందల ఒత్తిడులు. అలాంటి సున్నితమైన విషయాన్ని కథగా మలచుకున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన ఈ సినిమాకు సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించాడు. నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఇప్పుడి ఇదే చిత్రం తాజాగా రెండు ఓటీటీల్లో విడుదల కానుంది. 'అమెజాన్ ప్రైమ్ వీడియో', 'జియో హాట్‌స్టార్'లో ఈ నెల 19 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. చైతన్య (విక్రాంత్) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఓ ఎగ్జామ్ సెంటర్ లో కల్యాణి (చాందిని చౌదరి) ను చూసి ప్రేమలో పడతాడు. ఇద్దరూ దగ్గరౌతారు. కల్యాణి తండ్రి ఈశ్వరరావు (మురలీధర్ గౌడ్) వీరి ప్రేమని వ్యతిరేకించడంతో ఇద్దరూ పారిపోయి పెళ్లి చేసుకుంటారు. త్వరగా బిడ్డని కనేస్తే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తాడు చైతు. కాకపోతే పిల్లల విషయంలో తన ప్రయత్నాలు ఫలించవు. దీంతో ఓ సంతాన సాఫల్య కేంద్రాన్ని ఆశ్రయిస్తాడు. వైద్య పరీక్షలు చేయించుకోగా చైతన్యకి ఓ సమస్య ఉన్నట్లు బయట పడుతుంది. తర్వాత ఏం జరిగింది? తన సమస్య కారణంగా చైతన్య ఎలాంటి పరిస్థితులు ఎదురుకున్నాడు? చివరకు చైతన్య, కల్యాణికి పిల్లలు పుట్టారా లేదా ?అనేది మిగతా కథ.




# ధురంధర్‌తో సత్తా చాటిన అక్షయ్ ఖన్నా

**టాకీస్:** 'ధురంధర్' వంటి సూపర్ హిట్ సినిమాతో సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా క్రేజ్ మరోసారి ఆకాశాన్ని తాకింది. రణవీర్ సింగ్ హీరోగా నటించిన ఈ సినిమాలో అక్షయ్ ఖన్నా రెహ్మాన్ డకైట్ అనే పవర్‌ఫుల్ నెగటివ్ పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. విలన్ అయినప్పటికీ హీరోకంటే ఎక్కువ ప్రశంసలు దక్కడం ఆయన నటనకు నిదర్శనంగా మారింది. ప్రతి సీన్‌లో తనదైన స్టైల్, ఇంపాక్ట్‌తో మెరిసిన అక్షయ్ ఖన్నా 'ధురంధర్' సినిమాకు ప్రధాన బలంగా నిలిచారు. ఇదే ఏడాది ప్రారంభంలో విక్కీ కౌశల్ హీరోగా నటించిన 'చావా' సినిమాలో ఔరంగజేబు పాత్రలో అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఆయన, ఇప్పుడు 'ధురంధర్'తో మరోసారి తన సత్తా చాటారు. కథ, పాత్ర ఏదైనా సరే.. తెరపై కనిపిస్తే తనదైన ముద్ర వేయడం అక్షయ్ ఖన్నాకే చెల్లింది అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఇక సినిమాలతో పాటు అక్షయ్ ఖన్నా వ్యక్తిగత జీవితం కూడా తరచూ చర్చకు వస్తుంటుంది. ప్రస్తుతం ఆయన వయసు సుమారు 50 సంవత్సరాలు. అయినప్పటికీ ఇప్పటివరకు పెళ్లి చేసుకోలేదు. దీనిపై గతంలో ఓ మీడియా ఇంటర్వ్యూలో అక్షయ్ ఖన్నా చాలా స్పష్టంగా మాట్లాడారు. 'నాకు బాధ్యతలు వద్దు. నేను ఒంటరిగా ఉండటానికే ఇష్టపడతాను. ఎవరి గురించి ఆందోళన చెందకుండా నా జీవితాన్ని నేను ఆస్వాదించాలనుకుంటాను. నాకు ఇప్పుడు ఉన్న జీవితం చాలా బాగుంది. దాన్ని ఎందుకు మార్చుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. అక్షయ్ ఖన్నా ప్రముఖ బాలీవుడ్ నటుడు వినోద్ ఖన్నా కుమారుడు. 2025 నాటికి ఆయన మొత్తం ఆస్తులు సుమారు రూ.167 కోట్లుగా అంచనా వేయబడుతున్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో బంగ్లాలు, విలాసవంతమైన కార్లు ఆయన సొంతం. సినిమాలతో పాటు రియల్ ఎస్టేట్ పెట్టుబడుల ద్వారా కూడా భారీగా సంపాదిస్తున్నారు. నటుడిగా, వ్యక్తిగా తనదైన మార్గంలో ముందుకు సాగుతున్న అక్షయ్ ఖన్నా, పెళ్లి లేకుండానే సంతృప్తికరమైన జీవితాన్ని గడుపుతూ బాలీవుడ్‌లో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంటున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.